ANDHRA JYOTI, Vijayawada Regd. No. 375 ★★★ Telephone : 1343

చందారేట్లు

	విలేకరి ద్వారా	పోస్టుద్వారా
	రు. నప్రై.	రు. నప్రై.
సంవత్సరానికి	28.00	31.00
ఆరు మాసాలకు	14.00	15.50
మూడు మాసాలకు	7.00	7.90
ఒక మాసానికి	2.40	2.65

సర్క్యులేషన్ మేనేజర్ -
ఆంధ్రజ్యోతి, పో. బా. నెం. 334, విజయవాడ-2

ఆంధ్రజ్యోతి

ఎడిటర్ : నార్ల వెంకటేశ్వరరావు

120194

ప్రూసెస్ బ్లాకులు
ఆఫ్‌టోన్, లైన్ బ్లాకులు సకాలంలో చేసియివ్వగలము
విలాసాలకు క్రింది చిరునామాకు వ్రాయండి :
ఆంధ్రజ్యోతి
పో. బా. నెం. 334, విజయవాడ-2

సంవుటి 3 : : సంచిక 108 | విజయవాడ, అక్టోబర్ 19, 1962 శుక్రవారం | 6 పేజీలు : : 7 నయాపైసలు

సమితి కార్యదర్శి పదవికి తిరిగి ఉథాంట్ అభ్యర్థిత్వం

కొన్ని షరతులతో ఆయనను ఎన్నుకొనడానికి సోవియెట్ రష్యా సుముఖత్వం

అయితే, కార్యదర్శిత్రయ నియామకం ప్రతిపాదనను మాస్కో విడనాడదట

న్యూయార్క్, అక్టోబర్ 18—

సమితి కార్యదర్శిగా ఉథాంట్‌ను కొన్ని షరతులతో తిరిగి ఎన్నుకొనడానికి సోవియెట్ రష్యా సుముఖంగా వున్నట్టు తెలుస్తున్నది.

ఉథాంట్‌ను అయిదేళ్ళకంటె తక్కువ కాలానికి కార్యదర్శిగా ఎన్నుకునే పక్షంలోనే ఆయన అభ్యర్థిత్వాన్ని రష్యా సమర్థించ వచ్చునట.

సోవియెట్, పాశ్చాత్య, అలీన కూటాలకు ప్రాతినిధ్యం వహించే రీతిగా సమితి కార్యదర్శులుగా ముగ్గురిని నియమించాలనే తన ప్రతిపాదనను పునరుద్ఘాటించడానికి మాత్రం రష్యా అవకాశం అట్టిపెట్టుకుంటున్నట్టు అభిజ్ఞవర్గాలవారు ఇక్కడ భావిస్తున్నారు

ప్రస్తుతం శ్రీ ఉథాంట్ నిర్వహిస్తున్న అత్యున్నత బాధ్యతలకు ఆయన తగడని రష్యా ఎన్నడు భావించలేదని గత వారం సోవియెట్ విదేశాంగ మంత్రి శ్రీ ఆండ్రీ గ్రోమికో అన్నారు.

ఈ సమస్యను గురించి పరిశీలించే నిమిత్తం వచ్చేవారం భద్రతా సంఘం సమావేశం కానున్నది.

సంఘానికి వచ్చే మూడేళ్ళకు సోవియెట్ యూనియన్, బ్రిటన్, జపాన్, చెకోస్లావాకియా, ఆస్ట్రియా, అర్జెంటీనా ఎన్నికైనవి.

ప్రస్తుతం ఈ సంఘంలో సభ్యత్వం కలిగివున్న సోవియెట్ యూనియన్, జపాన్, బ్రిటన్‌లు తిరిగి ఎన్నికైనవి. డెన్మార్క్, పోలెండ్‌ల సభ్యత్వం పూర్తిఅయింది.

ధర్మకర్తృత్వ సంఘం సభ్యురాలుగా లైబీరియా ఎన్నికైనది.

నిన్నజరిగిన ఎన్నికల ఫలితంగా సమితికి చెందిన వివిధ సంఘాలలో ఈ కింది రాజ్యాలు వుంటాయి :

భద్రతాసంఘం: బ్రిటన్, ఫ్రాన్సు, రష్యా, అమెరికా, చైనా, నార్వే, బ్రెజిల్, ఫిలిప్పీన్స్, మొరాకో, వెనిజులా, ఘనా

ఆర్థిక, సాంఘిక వ్యవహారాల సంఘం: ఆస్ట్రేలియా, అర్జెంటీనా, ఆస్ట్రియా, బ్రిటన్, కొలంబియా, చెకోస్లావాకియా, ఎల్‌సాల్వాడార్, ఇథియోపియా, ఫ్రాన్సు, ఇండియా, ఇటలీ, జపాన్, జోర్డాన్, సెనెగల్, సోవియెట్ యూనియన్, అమెరికా, ఉరుగ్వే, యుగోస్లావియా.

ధర్మకర్తృత్వ సంఘం : ఆస్ట్రేలియా, చైనా, ఫ్రాన్సు, లైబీరియా, న్యూజిలెండ్, సోవియెట్ యూనియన్, బ్రిటన్, అమెరికా,



మహబూబ్‌నగర్ జిల్లాలోని కడిదల్‌లో పాలశీతలీకరణ కేంద్రానికి ప్లానింగ్ మంత్రి డాక్టర్ చెన్నారెడ్డి మొన్న శంకుస్థాపన జరిపినప్పటి ఫొటో

శుక్రగ్రహంలో జీవరాసి

మాస్కో, అక్టోబర్ 18—కజక్‌స్తాన్‌రాజధాని అల్మాఅటాలోని శాస్త్రవేత్తలు తమ పరిశోధనలు ఆధారంగా శుక్ర గ్రహంలో-జీవరాసి వుండడం సాధ్యమేనని నమ్ముతున్నారు.

రష్యన్ శాస్త్రవేత్త టిఖోవ్ (ఈయన 1960 లో మరణించారు) ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని ఈ పరిశోధనలు ధ్రువీకరిస్తున్నవి. భూమి కంటె శుక్ర గ్రహం సూర్యునికి దగ్గరలో వున్నప్పటికీ శుక్ర గ్రహోపరితలం ఉష్ణోగ్రత 80 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు మించదని. శుక్ర గ్రహం దిగ్వ్యాప్త వాతావరణపు ఉష్ణోగ్రత మాత్రమే 300 డిగ్రీ లున్నదని ఆయన అభిప్రాయం.

—273 డిగ్రీలకు, + 170 డిగ్రీల సెంటిగ్రేడ్‌కు మధ్య ఉష్ణోగ్రతలో జీవరాసి మనగలదని శాస్త్రవేత్తలు నిరూపించారు.

ఎడారులలోని మొక్కల రంగును పోలిన పసుపు పచ్చటి నారింజ రంగు మొక్కలు బహుశా శుక్ర గ్రహంపై వుండవచ్చునని శాస్త్రవేత్తలు అభిప్రాయపడుతున్నారు.

కాంగోలో కటాంగా విలీనం సమస్య

షోంబేతో చేసుకున్న ఒడంబడికలకు అదౌలా తిరస్కృతి

లియోపాల్డ్‌విల్ అక్టోబర్ 18—కటాంగాను, కాంగోలో తిరిగి విలీనం చేసుకునే విషయమై, కటాంగా అధ్యక్షుడు షోంబే చేసుకున్న ఒడంబడికలను, కేంద్ర ప్రభుత్వం ప్రధాని శ్రీ సిరిల్ అదౌలా నిరాకరించారు.

ఈ ఒడంబడికలు సమితి ప్రధాన కార్యదర్శి ఉథాంట్ చేసిన సూచనలకు విరుద్ధంగా వున్నవని ఆయనన్నారు.

లోకంతీరు



"ఈవెనింగ్ కాలేజీలో చేరితావా? అలా గేం? కాలేజీ పేరుతో సినిమాకు వెళ్ళచ్చు అవునా?"

శాంతిదూత నార్వే, బ్రెజిల్, ఫిలిప్పీన్స్‌లకు సభ్యత్వం

న్యూయార్క్, అక్టోబర్ 18 — భద్రతా సంఘంలో వచ్చే ఏడాది సభ్యురాలుగా ఫిలిప్పీన్స్ నిన్న ఎన్నికైనది.

నిజానికి, ఫిలిప్పీన్స్ ఎన్నిక కేవలం లాంఛనప్రాయమే.

గత సంవత్సరం భద్రతా సంఘం ఎన్నికలలో ప్రతిష్టంభన ఏర్పడినప్పుడు రెండు సంవత్సరాల సభ్యత్వకాలంలోను ఒక ఏడాది రుమేనియా, రెండవ ఏడాది ఫిలిప్పీన్స్ సభ్య రాజ్యాలుగా వుండాలని అప్పట్లో ఒప్పందం కుదిరింది.

1963 జనవరినుంచి బ్రెజిల్, నార్వేలు కూడా సభ్యరాజ్యాలుగా ఎన్నికైనవి. ఐర్లాండ్, చిలీలు భాగీచేసిన స్థానాలకు ఇవి ఎన్నికైనవి.

అరబ్ రిపబ్లిక్ స్థానంలో వచ్చే ఏడాది నుంచి మొరాకో భద్రతా సంఘం సభ్య రాజ్యంగా ఎన్నికైనది.

సమితి ఆర్థిక, సాంఘిక వ్యవహారాల సంఘానికి వచ్చే మూడేళ్ళకు సోవియెట్ యూనియన్, బ్రిటన్, జపాన్, చెకోస్లావాకియా, ఆస్ట్రియా, అర్జెంటీనా ఎన్నికైనవి.

ప్రస్తుతం ఈ సంఘంలో సభ్యత్వం కలిగివున్న సోవియెట్ యూనియన్, జపాన్, బ్రిటన్‌లు తిరిగి ఎన్నికైనవి. డెన్మార్క్, పోలెండ్‌ల సభ్యత్వం పూర్తిఅయింది.

ధర్మకర్తృత్వ సంఘం సభ్యురాలుగా లైబీరియా ఎన్నికైనది.

నిన్నజరిగిన ఎన్నికల ఫలితంగా సమితికి చెందిన వివిధ సంఘాలలో ఈ కింది రాజ్యాలు వుంటాయి :

భద్రతాసంఘం: బ్రిటన్, ఫ్రాన్సు, రష్యా, అమెరికా, చైనా, నార్వే, బ్రెజిల్, ఫిలిప్పీన్స్, మొరాకో, వెనిజులా, ఘనా

ఆర్థిక, సాంఘిక వ్యవహారాల సంఘం: ఆస్ట్రేలియా, అర్జెంటీనా, ఆస్ట్రియా, బ్రిటన్, కొలంబియా, చెకోస్లావాకియా, ఎల్‌సాల్వాడార్, ఇథియోపియా, ఫ్రాన్సు, ఇండియా, ఇటలీ, జపాన్, జోర్డాన్, సెనెగల్, సోవియెట్ యూనియన్, అమెరికా, ఉరుగ్వే, యుగోస్లావియా.

ధర్మకర్తృత్వ సంఘం : ఆస్ట్రేలియా, చైనా, ఫ్రాన్సు, లైబీరియా, న్యూజిలెండ్, సోవియెట్ యూనియన్, బ్రిటన్, అమెరికా,

"చైనా దురాక్రమణను సహించము"

శత్రువును గెంటివేయ వలసిందిగా విద్యార్థికాంగ్రెసు విజ్ఞప్తి

న్యూఢిల్లీ, అక్టోబర్ 18—అఖిల భారత విద్యార్థికాంగ్రెస్ సెక్రటేరియట్ నిన్న ఇక్కడ సమావేశమై ఈశాన్య సరిహద్దు ప్రాంతంలో చైనా దురాక్రమణను ఖండించి, భారత భూభాగంనుంచి దురాక్రమణదారుని గెంటివేయవలసిందిగా కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది.

ఈశాన్య సరిహద్దులో చైనా దురాక్రమ

[మిగతా 5 వ కాలంలో]

త్రిపుర సరిహద్దులోని ఇండో-పాక్ సేనలు

అక్టోబర్ 21 వ తేదీనాటికి యథాపూర్వ స్థానాలకు తరలింపుకు ఒప్పందం

న్యూఢిల్లీ, అక్టోబర్ 18—

త్రిపురపట్ల గల ఇండో-పాకిస్తాన్ సరిహద్దులోని రెండు దేశాల సైన్యాలు అక్టోబర్ 21 వ తేదీనాటికి తమ యథాపూర్వ స్థానాలకు తరలిపోతున్నవి

ఇండియా, పాకిస్తాన్ అధికారులమధ్య తేదీలోగా పూర్తిచేయాలి. ఆ తరువాత జిల్లా స్థాయిలో జరిగిన ఒప్పందం పరంగా ఈ మార్పు జరుగనున్నది.

ఈ సమావేశం ముందు అనుకున్నట్టు పిల్లాంగ్‌లో కాక, చిట్టగాంగ్‌లో జరిగింది. దీనికి త్రిపుర జిల్లా మేజిస్ట్రేటు, చిట్టగాంగ్ జిల్లా డిప్యూటీ కమిషనర్ పాల్గొన్నారు.

ఈ సమావేశంలో ఈ కింది ఒప్పందం జరిగింది.

ఉభయ దేశాల సేనలు ఇప్పటి స్థానాలనుంచి తమ పూర్వ స్థానాలకు తరలి వెళ్ళిపోయే కార్యక్రమాన్ని అక్టోబర్ 27 వ

ఏర్పాటు చేయబడుతుంది.

ఉభయ ప్రాంతాలలోను ఇప్పుడువున్న కందకాలు మొదలైన వాటిని తొలగించి వేయాలి.

ప్రజేంద్రనగర్ చుట్టూ ఉభయదేశాలు చేసుకున్న రక్షణ ఏర్పాట్లను రద్దుచేయాలి

తమను భూములనుంచి తొలగించి వేశారని త్రిపుర, చిట్టగాంగ్ ప్రాంతాలలోని వ్యవసాయదారులు చేసిన ఆరోపణలను పరిశీలించాలి.

మనుమలు, మునిమనుమలు 120 మంది

మాస్కో, అక్టోబర్ 18—ఇటీవల తజికిస్తాన్‌కు చెందిన నావుగాల్ గ్రామవాసి అయిన ఖోసియత్ అఖునోవా అనే వృద్ధురాలు తన నూరవ జన్మదినోత్సవం జరుపుకొన్నది. ఆమె మనుమలు, ముని మనుమలు వారి పిల్లలు మొత్తం 120 మంది ఈ ఉత్సవానికి వచ్చారు.

వీరేగాక, సమష్టి వ్యవసాయ క్షేత్రం సభ్యులుకూడా చాలామంది వచ్చారు. వీరిలో 80 మంచి 96 ఏళ్ళ మధ్య వయస్సుగల 20 మంది పిఛన్‌దారులు కూడా వున్నారు. గ్రామమంతటికీ వృద్ధురాలైన ఈమె జన్మదినోత్సవం వైభవంగా జరిగింది.

కేరళలో మునిసిపల్ చెయిర్మన్‌ల ఎన్నిక

ప్రకటించిన 23 స్థానాలలో 12 కాంగ్రెసు కైవసం

తిరువనంతపురం, అక్టోబర్ 18—కేరళలో కొత్తగా ఏర్పడిన 26 మునిసిపల్ కౌన్సిల్స్ చెయిర్మన్ పదవులకు నిన్న ఎన్నికలు జరిగినవి.

వీటిలో నిన్నరాత్రి వరకు అధికారపూర్వకంగా అందిన సమాచారాన్నిబట్టి ప్రకటించిన 23 స్థానాలకు 12 స్థానాలు కాంగ్రెసు కైవసమైనవని తెలియవచ్చింది.

ఇంకా మూడు మునిసిపాలిటీల ఫలితాలు ప్రకటించవలసి వున్నది.

26 మునిసిపాలిటీలకు పోలింగు గతనెల చివరి వారంలో జరిగింది.

కమ్యూనిస్టులకు ప్రకటించిన వాటిలో ఇప్పటివరకు నాలుగు స్థానాలు లభించాయి. కమ్యూనిస్టులు బలపరచిన ఇండిపెండెంట్ అభ్యర్థులకు నాలుగు స్థానాలు. ఆర్. ఎస్. పి. కి ఒక స్థానం లభించాయి.

రెండు మునిసిపాలిటీలలో ఇండిపెండెంట్ అభ్యర్థులు చెయిర్మన్‌లుగా ఎన్నికయినారు

త్రిచూర్ మున్సిపల్ కౌన్సిల్ అధ్యక్షుడుగా శ్రీ సి. సి. జార్జి (కాంగ్రెసు) ఎన్నికైనట్టు త్రిచూర్ వార్త.

పి. సి. సి. కార్యదర్శి పదవీ వివాదం

శ్రీ విజయ భాస్కరరెడ్డి నియామకాన్ని ఆమోదించే నిమిత్తం వచ్చేనెల 9 వ తేదీన సర్వసభ్య సమావేశం ఏర్పాటు

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, అక్టోబర్ 18—

శ్రీ విజయభాస్కరరెడ్డిని పి. సి. సి. కార్యదర్శిగా నియమించడంలో అధ్యక్షుని చర్యను ఆమోదించే నిమిత్తం పి. సి. సి. సర్వసభ్య సమావేశం నవంబర్ తొమ్మిదవ తేదీన హైదరాబాద్‌లో జరుగుతుందని శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య నేడిక్కడ "ఆంధ్రజ్యోతి" ప్రతినిధికి తెలియజేశారు.

ఆ రోజు మధ్యాహ్నం మూడు గంటలకు జరిగే ఈ సమావేశంలో ఈ విషయంతోపాటు సంస్థకు సంబంధించిన ఇతర వ్యవహారాలపై కూడా చర్చ జరుగుతుంది.

పి. సి. సి కార్యవర్గ సభ్యుడు కానందున శ్రీ విజయభాస్కరరెడ్డిని కార్యదర్శిగా నియమించడానికి వీలులేదని. కాబట్టి ఆయన రాజీనామా చేయాలని ఏ. ఐ. సి. సి ఆదేశించిన విషయం పాఠకులకు విదితమే.

ఇందుకు రాష్ట్ర కాంగ్రెస్‌వారు సమాధానం చెబుతూ శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్య అధ్యక్షుడుగా ఎన్నికైనందున, ఆయన స్థానంలో శ్రీవిజయభాస్కరరెడ్డిని కార్యవర్గ సభ్యుడిగా నియమించడం జరిగిందని పేర్కొన్నారు.

అయినా, కార్యదర్శిగా శ్రీ విజయభాస్కర రెడ్డి నియామకం సక్రమం కాదని. ఆయన రాజీనామా చేయాలని కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీ సంజీవయ్య మొన్న ప్రకటించారు

ఈ సందర్భంలో తమ అధ్యక్షుని చర్యను ఆమోదించే నిమిత్తమే వచ్చేనెలలో పి. సి. సి. సర్వసభ్య సమావేశం జరుగనున్నది.

ఎర్నాకుళం మునిసిపల్ కౌన్సిల్ అధ్యక్ష పదవికి ఈ నెల 17వ తేదీన జరిగిన ఎన్నికలో శ్రీ పి. ఎ. కురువిళ్ళ (కాంగ్రెస్) గెలుపొందినట్టు ఎర్నాకుళం వార్త.

(3 కాలం తరువాయి)

జనం భాగీ చేయించడానికి భారత ప్రభుత్వం చేపట్టిన అన్ని చర్యలను తాము పూర్తిగా బలపరచుతున్నామని సమావేశంలో ఉద్ఘాటించారు.

భారతదేశానికి వ్యతిరేకంగా దుష్ప్రచారం సాగించే సమాచారం గల చైనా సాహిత్యాన్ని బహిష్కరించవలసిందిగా దేశంలోని విద్యార్థి లోకానికి విజ్ఞప్తి చేశారు.

ఇండియా, చైనా సరిహద్దు వివాదంపై భారత కమ్యూనిస్టుపార్టీ అవలంబించే విధానానికి సమావేశం తన విచారాన్ని వ్యక్తపరుస్తూ, సరిహద్దు పరిస్థితిపట్ల సరియైన దృక్పథాన్ని కలిగివుండాలని కోరారు. చైనా విస్తరణ తత్వాన్ని ఇండియాప్రజానికి లక్షలాది భారత సోదరులతో కలసిపోవలసిందిగా కమ్యూనిస్టులను కోరారు.

ఆరబ్ లీగ్ సమావేశం

ఎమెన్ ఇమాం విజ్ఞాపన

కయిరో, అక్టోబర్ 17—ఎమెన్ అంతరంగిక వ్యవహారాలలో అరబ్ రిపబ్లిక్ జోక్యం చేసికొనడాన్ని గురించి పరిశీలన జరిపే నిమిత్తం అరబ్‌లీగ్ సమితి అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరతూ వచ్చిన తంతిని ఎవరు పంపించారో తెలుసుకొనడానికి ఇక్కడి లీగ్ అధికారులు ప్రయత్నిస్తున్నారు

విద్యారంగంలో పురోభివృద్ధి సాధన

ప్రాథమిక పాఠశాలలలో కొత్తగా 40,00,000 మంది ప్రవేశం

ప్రణాళికా లక్ష్యానికి మించి 18 లక్షలు చేరినదని కేంద్ర మంత్రి వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 18—

దేశంలోని ప్రాథమిక పాఠశాలలలో ఈ ఏడాది మొత్తం 40 లక్షలమంది బాల బాలికలు కొత్తగా ప్రవేశించారని, ఈ సంఖ్య ప్రణాళికా లక్ష్యానికి 18 లక్షలు మించి వున్నదని కేంద్ర విద్యామంత్రి డాక్టర్ కె యల్. శ్రీ మాలి నేడిక్కడ తెలియజేశారు.

రాష్ట్ర విద్యా మంత్రుల మహాసభలో డాక్టర్ శ్రీ మాలి ప్రసంగిస్తూ పై విషయాన్ని తెలియజేశారు.

ఇదే సంఖ్యలో ప్రాథమిక పాఠశాలలలో బాల బాలికల ప్రవేశం కొనసాగినట్లయితే, తృతీయ ప్రణాళిక లక్ష్యమైన 152 లక్షల సంఖ్య ప్రణాళిక ముగియడానికి ముందే పూర్తి కాగలదని అన్నారు.

విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరగడం హర్షదాయకమైన విషయమేనని, విద్యా విస్తరణవల్ల ఉత్పన్నమయ్యే అనేక సమస్యలను, దూరదృష్టితోను సమర్థంగాను పరిష్కరించవలసిన అవసరంకూడ కలదని ఆయనన్నారు

80 వేల మంది ఉపాధ్యాయుల కొరత

తృతీయ ప్రణాళికలోని మొదటి రెండు సంవత్సరాలకు 80వేల మంది ఉపాధ్యాయులు కావలసివున్నారని. ఈ సమస్యను సత్వరం పరిష్కరించడానికి కృషి చేయాలని కోరారు

రెండు రోజులపాటు జరిగే ఈ మహాసభకు శ్రీ మాలి అధ్యక్షత వహించారు

వయోజనవిద్య, శిశుసంక్షేమం, బడిపిల్లలకు మధ్యాహ్న భోజన పథకం, ఉపాధ్యాయులకు శిక్షణ, ఉపాధ్యాయుల పని పరిస్థితులను మెరుగుపరుచడం వంటి కార్యక్రమాలకు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం అందజేస్తున్న సహాయ పథకాలను ఆయన వివరించారు.

విద్యారంగంలో కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల మధ్య ఇతోధిక సమన్వయాన్ని సాధించడానికి ఈ లక్ష్యసాధనకు సముచితమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేసే నిమిత్తం మహాసభ తగు సూచనలు చేయగలదని తా నాశిస్తున్నానన్నారు.

"త్రిభాషా సూత్రాన్ని సత్వరం అమలు జరపాలి"

జాతీయ సమైక్య సాధనమందలి ఆమోదించిన త్రిభాషా సూత్రాన్ని సత్వరంగా అమలు జరపాలని ఆయన కోరారు.

వివిధ రాష్ట్రాలలో ఆయా ప్రాంతీయ భాషలనే బోధన భాషగా ప్రవేశపెట్టి, హిందీ, ఇంగ్లీషు భాషల బోధనకూడ పటిష్ఠం చేయాలని సర్వత్రా ఆమోదించారని, హిందీ ఇంగ్లీషు భాషల బోధనను పటిష్ఠం చేయడం వల్ల దేశంలోని వివిధ భాషాప్రాంతాల మధ్య, భారతదేశం ప్రపంచంలోని ఇతర దేశాల మధ్య సన్నిహిత సంబంధాలు వెంపొందగలవని అందరు అంగీకరించారని చెప్పారు.

పాఠ్యగ్రంథాల ప్రచురణ

పాఠ్యగ్రంథాల ప్రచురణ సమస్యను కేంద్రమంత్రి ప్రస్తావించి, పాఠశాలలకు పుస్తకాలను సరఫరా చేయడంలో ప్రచురణకర్తల పోటీకి అవకాశ మివ్వకుండా, విద్యావేత్తల సహకారంతో స్వయంగా పాఠ్యగ్రంథాలను రూపొందించుకొనాలని సూచించారు. ఈ విషయంలో రాష్ట్రాలమధ్య పరస్పర సహకారం పొందడానికి అనేక అవకాశాలు కలవని ఆయన తెలియజేశారు.

కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన పాఠ్యగ్రంథాలు అతిపేలవంగా వుండడమే గాక, ప్రజలలో వ్యతిరేకభావాన్ని కలిగించేవిగా కూడ వున్నవని డాక్టర్ శ్రీ మాలి తెలియజేశారు. ఈ పరిస్థితి సమర్థనీయం కాదని, కాగా సహించరానిదని కూడ ఆయన ఉద్ఘాటించారు.

పాఠశాలలలో పుస్తకాలను ప్రవేశపెట్టేముందు విద్యావేత్తలతో పునఃపరిశీలన జరిపించాలని కోరారు.

సౌదీ అరేబియా మంత్రివర్గం బర్తరఫ్

తన సోదరుడు అబ్దుల్ అజీజ్‌ను ప్రధానిగా నియమించినట్టు రాజు ప్రకటన

అమ్మాన్, అక్టోబర్ 18—

సౌదీ అరేబియా రాజు ప్రస్తుత మంత్రివర్గాన్ని బర్తరఫ్ చేసి, తన సోదరుడు అమీర్ అబ్దుల్ అజీజ్‌ను ప్రధానిగా నియమించారు. "దేశ ప్రయోజనాల పరిరక్షణ దృష్ట్యా" రాజు ఈ చర్య తీసుకొన్నారట

ఈ విషయాన్ని మక్కా రేడియో వెల్లడిస్తూ కొత్తమంత్రి వర్గం ఏర్పడేవరకు అధికారంలో వుండవలసిందిగా ఇప్పటి మంత్రి వర్గాన్ని రాజు ఆదేశించినట్టు పేర్కొన్నది.

1960 డిశంబర్‌లో తానే ప్రధానిగా సౌదీరాజు ప్రభుత్వాన్ని ఏర్పరచారు. గత మార్చిలో ఈ మంత్రివర్గాన్ని పునర్నిర్మించారు. అప్పుడు ప్రిన్స్ ఫైజల్ ఉపప్రధాని. విదేశాంగ మంత్రి పదవులను స్వీకరించారు

ఎమెన్‌కు బ్రిటన్ గర్భ శత్రువని ఎమెన్ విప్లవ ప్రభుత్వంలోని ఒక మంత్రి సన్నవిమర్శించారు.

ఎమెన్ నిహాసనానికి వారసుడనని చెప్పుకుంటున్న ప్రిన్స్ హసన్ కంటె, సౌదీ అరేబియా రాజుకంటె కూడా బ్రిటన్ తమకు ఎక్కువ కిరమైన శత్రువని విప్లవ ప్రభుత్వాలలో పరిపాలనా వ్యవహారాలశాఖ మంత్రి శ్రీ అహమ్మద్ నోమన్ అన్నారు.

తమ తూర్పుసరిహద్దు పొడవునా బ్రిటన్ సైనిక బలగాలు జరుపుతున్నదని ఆయన విమర్శించారు.

ఎమెన్‌కు రష్యా సహాయం

మరొక సంవత్సరం పాటు ఎమెన్‌కు సాయం చేయడానికి రష్యా అంగీకరించినట్టు సౌదీ రేడియో ప్రకటించింది.

ఎమెన్‌కు సాంకేతిక, వ్యవసాయ నిపుణులను పంపడానికి రష్యా అంగీకరించిందట.

ఎమెన్ రిపబ్లిక్‌ను ఇండోనేసియా గుర్తించినట్టు కూడా సౌదీ రేడియో ప్రకటించింది

ఎమెన్‌లో కొండజాతి ప్రజల తిరుగుబాటు అణచివేత

కయిరో, అక్టోబర్ 18. కొత్త ఎమెన్ ప్రధాని కర్నల్ సల్లాల్ నిన్నరాత్రి మాట్లాడుతూ సౌదీ ప్రాంతంలో కొండజాతివారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిపిన తిరుగుబాటును అణచివేసినట్టు తెలియజేశారని మధ్యతరియా వార్తాసంస్థ వెల్లడించింది.

రాజుకు అనుకూలంగా వున్న కొండజాతివారు ఆయుధాలను విడిచిపెట్టి పలాయనమైనారని కర్నల్ సల్లాల్ సావ్‌లోని మధ్యతరియా వార్తాసంస్థ విలేకరికి తెలియజేశారు.

1962 అక్టోబర్ 19 శుక్రవారం
శ్రీ శుభకృతునామ సంవత్సర
ఆశ్వయుజ బహుళ సప్తమి
సప్తమి : రా॥ 2-1
ఆర్ద్రి : మ॥ 1-42
వర్జ్యం : సా॥ 2-10 నుంచి 3-60 వరకు
* * *
1962 అక్టోబర్ 20 శనివారం
శ్రీ శుభకృతునామ సంవత్సరం
ఆశ్వయుజ బహుళ అష్టమి
అష్టమి : రా॥ 2-45
పూర్వాణ : మ॥ 2-38
వర్జ్యం : రా॥ 11-2 నుంచి 12-45వరకు

ఆంధ్రజ్యోతి
"తమసో మా జ్యోతిర్గమయ"

అణ్వస్త్ర పరీక్షలు

వచ్చే జనవరి తర్వాత అణ్వస్త్ర పాటవ పరీక్షలు నిలిచిపోగలవా? నిలిచిపోగలవనే తాను ఆశిస్తున్నట్టు రాజాజీ లండన్‌లో అన్న తెలియజేశారు.

ఆయన ఈ మాట చెప్పిన తర్వాత జెనీవాలో అణ్వస్త్ర పాటవ పరీక్షల నిషేధం విషయంలో ఒడంబడికను సాధించడానికై జరుగుతున్న సమావేశంలో సోవియెట్ ప్రతినిధి ప్రసంగం ధోరణి పాశ్చాత్య ఉద్యోగుకు ఆశ్చర్యాన్ని కలిగించినట్టు అక్కడినుంచి వచ్చిన వార్తలు సూచిస్తున్నాయి అణ్వస్త్ర పరీక్షలు నిజంగా నిలిచిపోయినవో, లేదో నిర్ణయించడానికి అంతర్జాతీయ పర్యవేక్షణ సంఘ నియామకానికి ఏ పరిస్థితులను తమ ప్రభుత్వం సమ్మతించబోదని సోవియెట్ ప్రతినిధి స్పష్టం చేశాడట. పర్యవేక్షణతో నిమిత్తం లేకుండానే అణ్వస్త్ర పరీక్షలు ఎక్కడ జరిగినా వాటిని కనిపెట్టగల యంత్రాలు నేడు కలవని ఆయన పేర్కొన్నాడట.

ఎంత గుప్తంగా జరిగిన అణ్వస్త్ర పరీక్షలను కనిపెట్టగల యంత్రాలు నేడున్నవని శాస్త్రవేత్తలే చెబుతున్నారు రెండు నెలలనాడు కేంబ్రిడ్జిలో సమావేశమై, ఈ విషయమై చర్చలు జరిపిన శాస్త్రవేత్తలు "చెక్ బాక్స్" అనే పరికరం ద్వారా అణ్వస్త్ర పరీక్షలను కనిపెట్టవచ్చునని సూచించారు. ఇది శాస్త్రవేత్తల అభిప్రాయమైనప్పుడు పర్యవేక్షణ విషయమై పాశ్చాత్య రాజ్యాలు పట్టు పట్టవలసిన అగత్యం కనబడదు.

అంతరిక్షంలోను, సముద్ర గర్భంలోను అణ్వస్త్ర పరీక్షల నిషేధానికి ప్రస్తుతం ఉభయ వర్గాలవారు సుముఖంగానే వున్నారు. పోతే, భూగర్భంలో పరీక్షల విషయంలోనే పేచీ లన్నీ.

పర్యవేక్షణకు కట్టుదిట్టాలను చేయకపోతే భూగర్భంలో జరిగే అణ్వస్త్ర పరీక్షలను కనిపెట్టడం సాధ్యం కాదని అమెరికా వాదిస్తున్నది. పర్యవేక్షణ విషయమై అమెరికా పట్టుదల తన సరిహద్దులలో గూఢచారి చర్యలను కొనసాగించడానికే అని సోవియెట్ రష్యా అనుమానపడుతున్నది.

గూఢచారి చర్యలకు అవకాశం లేని విధంగా పర్యవేక్షణకు యేర్పాట్లు చేయడానికి వీలు లేదా? చర్చల ద్వారా తప్ప ఈ సంగతి తేలదు. ఈలోపుగా భూగర్భంలో అణ్వస్త్ర పరీక్షలను జరపకుండా ఒక తాత్కాలికపు ఒడంబడిక చేసుకోవాలని సోవియెట్ రష్యా ప్రతిపాదిస్తున్నది. ఇందుకు అమెరికా అభ్యంతరం చెబుతున్నది

భూగర్భంలో జరిగే అణ్వస్త్ర పరీక్షలను కనిపెట్టడం వ్యయభారంతో కూడిన కార్యమట. డబ్బు మూలుగుతున్న దేశం కాబట్టి. అమెరికా ఎంత ఖర్చుకైనా సన్నద్ధపడవచ్చునని, ఇది తనకు సాధ్యం కాదని రష్యా వాదం.

ఏమైనా, ప్రస్తుతం ఉభయ పక్షాల మధ్య కానవచ్చే విభేదం చాలా స్వల్పం అలీనరాజ్యాల ప్రతినిధులతో కూడిన పర్యవేక్షక సంఘానికి రష్యా అంగీకరించవచ్చు లేదా, "చెక్ బాక్స్" పరికరం ద్వారా భూగర్భంలో జరిగే పరీక్షలనైనా కనిపెట్టవచ్చుననే శాస్త్రవేత్తల తీర్మానాన్ని అమెరికా మన్నించవచ్చు. కావలసింది పరస్పరానుమానాలేమి, భయసందేహాలేమి కొంత తగ్గడమే! ఇందుకే రాజాజీ, శ్రీ డేబర్‌లు అమెరికన్, సోవియెట్ నాయకులకు విజ్ఞప్తి చేశారు. వీరి కృషి ఫలప్రదం కావాలని సమస్త ప్రపంచం మనసారా కోరుతున్నది.

కార్మిక భద్రతామండలి పథకం

రూపొందిస్తున్నట్టు శ్రీ నందా వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 17—పారిశ్రామిక సంబంధాలను మెరుగు పరచడానికి యజమానులు స్వచ్ఛంద మధ్యవర్తిత్వ విధాన సూత్రాలను ఆమోదించాలని అటవీరంగం కార్మికులు క్రమశిక్షణను అలవరచుకొనాలని కేంద్ర కార్మికశాఖ మంత్రి శ్రీ గుల్జారీలాల్ నందా నేడిక్కడ జరిగిన సమావేశంలో మాట్లాడుతూ ఉద్బోధించారు

త్రైపాక్షిక కార్మిక స్థాయిసంఘం 20 వ సమావేశంలో శ్రీనందా ప్రసంగిస్తూ, వివాదాలు సార్యమైనంతవరకు రాకుండా చేయాలని, పారిశ్రమిక వివాదాలు ట్రిబ్యునల్ పరిశీలనకు రాకుండా, కార్మిక సంఘాలవారే ఆ వివాదాలను పరిష్కరించడానికి కృషి చేయాలని ఉద్బోధించారు.

కేంద్ర, రాష్ట్ర స్థాయిలలో కార్మిక భద్రతా మండలులను ఏర్పాటుచేసే పథకం నెలలోపుగా సిద్ధం చేయబడుతున్నదని శ్రీ నందా తెలియజేశారు.

ఇంజిన్ డ్రైవరు సాంకేతిక పరీక్షలు

ధవళేశ్వరంలో ఏర్పాటు

హైదరాబాద్, అక్టోబర్ 18—ఇంజిన్ డ్రైవర్లకు వాటర్‌వర్క్స్ పంపులు బిగించువారికి జడగు ప్రభుత్వ సాంకేతిక పరీక్షలు ఈ నెల 22 వ తేదీ నుంచి ధవళేశ్వరంలోని పబ్లిక్ వర్క్స్ వర్క్‌షాపులో నిర్వహించబడతాయని ప్రకటించారు.

టీకా-టిప్పణి

సెకండరీ విద్య

దేశంలో జాతీయ సమైక్యం పెంపొందించడానికి చిన్నతనంలోనే, విద్యార్థి దశలోనే పునాదులు వడాలి: లేత మనసులలోనే భావసమైక్యబీజాలు నాటాలి. ఈ దృష్టితో చూస్తే మొత్తం దేశంలో ఒకే విధమైన సెకండరీ విద్యను రూపొందించాలని అఖిల భారత సెకండరీ ఉపాధ్యాయుల సమాఖ్య చేసిన సూచన నిర్మాణాత్మకమైన దనడంలో సందేహంలేదు.

అయితే, ఈ ఆదర్శాన్ని ఆచరణలో పెట్టడానికి సాధక బాధకాలు చాలా వుంటాయి. దేశమంతటికి ఒకే విధమైన పాఠ్య ప్రణాళికను ముందు రూపొందించాలి. వివిధ ప్రాంతాల సంప్రదాయాలకు, ఆచార వ్యవహారాలకు, భావాలకు తగిన ప్రాతినిధ్యమిస్తూ, పరస్పర వైరుధ్యం లేకుండా, అన్నిటిని సమన్వయించు కుంటూ పాఠ్యపుస్తకాలను తయారు చెయ్యాలి, వాటిని ఆయా ప్రాంతీయ భాషలలోకి తర్జుమా చేయించాలి. భాషలు, మతాలు, ప్రాంతాలు, ఆచారాలు వేరైనా, అందరూ భారతీయులే, అందరి మూలసంస్కృతి ఒకటే అనే భావం విద్యార్థులలో నాటుకునేట్టు పాఠ్య విషయాలను రూపొందించాలి. దీనికై అన్ని రాష్ట్రాలకు, భాషలకు, మతాలకు ప్రాతినిధ్యం వహించే ఒక కేంద్ర సంస్థ ఏర్పడాలి. ఇంత తతంగం జరిగితే గాని, ఉపాధ్యాయుల సమాఖ్య చేసిన సూచన ఆదర్శప్రాయమైన పద్ధతిలో అమలుకురాదు.

అయినా, ఇది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యావేత్తలు శ్రద్ధగా, అత్యవసర సమస్యగా పరిశీలించగలిగిన సూచనే. ఈ సూచన అమలు జరిగిననాడు, కొంత ఆలస్యంగానైనా, మరొక తరానికైనా, సరియైన, దృఢమైన పునాదుల మీద జాతీయ సమైకాదర్శం సాధ్యం కాగలదు, ఒక కొత్త భారతజాతి ఉదయించగలదు.

పరిశ్రమలకు విద్యుచ్ఛక్తి

ఆంధ్రప్రదేశ్‌లో కొత్త పరిశ్రమలస్థాపనకు విద్యుచ్ఛక్తి కొరత పెద్ద అవరోధంగా వున్నది. ఉన్న పరిశ్రమలకే విద్యుచ్ఛక్తిని సరఫరా చేయడం కష్టతరంగా వున్నది. ఈ కారణం చేతనే అన్ని సౌకర్యాలను కలిగజేస్తామని రాష్ట్ర ప్రభుత్వ ఆహ్వానిస్తున్నా, ఇతర రాష్ట్రాలవారుగాని, ఈ రాష్ట్రంవారుగాని సాహసించి ముందుకు రావడంలేదు. కనుక, ముందు తగినంత విద్యుచ్ఛక్తిని సమకూర్చుకొనాలి.

మన రాష్ట్రంలో ఎవరైనా తమ పరిశ్రమలకు కావలసిన శక్తిని విద్యుచ్ఛక్తిని తామే ఉత్పత్తి చేసుకొనడానికి ఉత్సాహపడితే రాష్ట్ర ప్రభుత్వం అందుకు అనుమతిస్తుందని పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ లక్ష్మీనరసయ్య నిన్న మద్రాసులో చెప్పారు, ఇందుకు కేంద్రం సమ్మతించినా, సమ్మతించకపోయినా తాము పూనుకునేది లేదన్నారు.

అయితే 'కేంద్రం అంగీకరించడమనుకోవడానికి తగిన కారణం కనబడదు. ప్రయివేట్ రంగంలో థర్మల్ విద్యుదుత్పత్తి ప్రయోజనకరంగా వుండేట్లయితే అనుమతించడానికి ప్లానింగ్ కమిషన్ సిద్ధంగానే వున్నదని భారతవాణిజ్య మండలుల సమాఖ్య అధ్యక్షుడు శ్రీ ఎస్ పి జైన్ నిన్న హైదరాబాదులో చెప్పడంలో.

కాని, దరికే అనుమతించడం చాలదు విద్యుత్కారి శ్రామికులకు తగిన సౌకర్యాలు, ప్రోత్సాహం కలిగించాలి. ఈ పరిశ్రమలో పెట్టిన పెట్టుబడిపై బ్యాంకులేటులకాక, నూటికి మరొక రెండువంతులను మాత్రం లాభాలుగా ప్రభుత్వం అనుమతిస్తున్నది. ఇది చాలదని, దాన్ని నూటికి మూడువంతులకైనా పెంచాలని కొంతకాలంగా ఆందోళన జరుగుతున్నది. ఈ విధమైన సాధక బాధకాలను పరిష్కరించనిదే విద్యుత్పరిశ్రమలను నెలకొల్పడానికి ఎవరూ ముందుకురారు. కనుక, కేంద్రాన్ని ఈ విషయమై ఒప్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం యత్నించాలి.

దక్షిణాఫ్రికా

సాధారణంగా ఏదేశంలోనైనా అల్పసంఖ్యాకులకు అన్యాయం జరుగుతున్నదనే ఆరోపణలు రావడంకద్దు ఒక్క దక్షిణాఫ్రికాలో మాత్రం ఇందుకు విరుద్ధంగా అధిక సంఖ్యాకుల పట్లనే అన్యాయం జరుగుతున్నది. ఈ అన్యాయాన్ని ఐక్యరాజ్య సమితి ఖండించడం ఏటా పరిపాటి అయిపోయింది. ఈ మేడు కూడా ఇది చర్చకు వచ్చింది దక్షిణాఫ్రికాకు మిత్రులైన కొద్దిమంది తప్ప అంతా ముక్తకంఠంతో దాని దారుణ విధానాలను ఖండించారు.

అయితే ఈ ఖండన ముండనలను ఖాతరు చేసే స్థితిలో దక్షిణాఫ్రికాలేదు. దానికి వెనుకకొన్ని పశ్చిమ రాజ్యాల అండదండలున్నాయి. వాటిని చూచుకునే అది సమితి నీతి కాలం దిక్కరిస్తూవస్తున్నది. అమెరికా, బ్రిటన్‌లకు దక్షిణాఫ్రికాలో లాభసాటిగా ఎగుమతి, దిగుమతి వ్యాపారం జరగడమే కాక, అక్కడ అపారమైన పెట్టుబడులున్నాయి. ఇది కాక, బ్రిటన్ ఆయుధ సహాయం చేస్తున్నది. యుద్ధ విమానాలు తయారుచేసే ఇవ్వడానికి కూడా అంగీకరించింది. ఇవన్నీ దేశరక్షణకుపయోగపడేవి కావు: కేవలం ఆఫ్రికన్ జాతి తిరుగుబాటు నుంచి శ్వేత జాతిపాలకులను రక్షించడానికే.

దక్షిణాఫ్రికాకు ఈ విధంగా కొన్ని పెద్ద రాజ్యాలు మద్దతుగా వున్నంతకాలం అది సమితిని ధిక్కరిస్తూనే వుంటుంది. సమితిలో ఆఫ్రో-ఆసియన్ దేశాలకు, లాటిన్ దేశాలకు వున్న సంఖ్యా ప్రాబల్యం కారణంగా, దాన్ని సమితి నుంచి బహిష్కరించినా ఆర్థిక ఆంక్షలు ప్రయోగించనిదే. దానివల్ల ప్రయోజనం వుండదు. ఇందుకు ముఖ్యంగా బ్రిటన్, అమెరికాలను ఒప్పించడానికి యత్నం జరగాలి.

* * *

అప్పారావు తన స్నేహితుడితో: "బ్రదర్! పాతిక రూపాయ లుంటే యిస్తావా? మెడ్రాసెళ్ళి రాగానే యిచ్చేస్తాను."

"ఎప్పుడొస్తావు తిరిగి?"

"వెళ్ళిన మూడో నాటికల్లా రానూ?"

"అసలెప్పుడు వెడుతున్నావు?"

"అదే చూస్తున్నాను: వెళ్ళడమా, దానమా అని."

మంత్రి శ్రీ బలరామరెడ్డి పర్యటన

హైదరాబాద్, అక్టోబర్ 18—రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి శ్రీ ఎ బలరామరెడ్డి రేపు ఇక్కడ నుంచి బయలుదేరి ఇతర జిల్లా, పాకాల, తిరుపతి సందర్శించి తిరిగి 23 వ తేదీకి రాజధానికి వస్తారు.

"నీరా సంఘాలు కల్లు అమ్మడానికి వీలు లేదు"

ఇందుకు ప్రభుత్వం అనుమతించబోదని మంత్రి శ్రీ ఎమ్. ఆర్. అప్పారావు స్పష్టీకరణ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి) హైదరాబాద్, అక్టోబర్ 8—నీరా సంఘాలకు కల్లు అమ్ముకునే అధికారమివ్వడం, అనుభవమని, మద్యపాన నిషేధమే కాంగ్రెస్ ప్రభుత్వ విధానమని మంత్రి (శ్రీ ఎమ్ ఆర్. అప్పారావు నేడిక్కడ ఒక ప్రత్యేక సమావేశంలో స్పష్టం చేసినట్టు తెలుస్తున్నది.

రేపల్లె, నూజివీడులలో నీరానుంచి చక్కెరను తయారుచేయడానికి వుద్దేశించిన ప్రయోగాత్మక పథకాలను ఏవిధంగా అమలు పరచాలనే సమస్యను గురించి చర్చించే నిమిత్తం మద్యనిషేధ శాఖ మంత్రి శ్రీ అప్పారావు నేడిక్కడ ఒక ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సమావేశంలో పరిశ్రమల శాఖ డైరెక్టర్, ఎక్సయిజ్ శాఖ ఉద్యోగులు, రెవిన్యూ శాఖ కార్యదర్శి, కల్లు గీతపనివారి ప్రతినిధులు, నీరా సంఘాల ప్రతినిధులు, రాష్ట్ర ఖాదీ బోర్డు అధ్యక్షుడు శ్రీ పి. తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

ఈ చక్కెరఫ్యాక్టరీలను రాష్ట్రప్రభుత్వం తరపున ఖాదీబోర్డు నిర్వహిస్తుంది.

ఈ సమావేశంలో నీరా సంఘాల భవిష్యత్తును గురించి చర్చించారు.

శ్రీ తిమ్మారెడ్డి ప్రసంగిస్తూ నీరా సంఘాలని పేరేగాని, అవి చాలా వరకు కల్లు అమ్ముతున్నవని, అందువల్ల బహిరంగంగానే కల్లు అమ్ముకొనడానికి వాటికి అనుమతి నివ్వాలని సూచించినట్టు తెలుస్తున్నది.

పరిశ్రమల డైరెక్టర్ శ్రీ వోట్స్ మాట్లాడుతూ నీరానుంచి ఎలాంటి చక్కెరనైనా తయారుచేయడానికి అవకాశం కలదని, మొదట్లో కొంతకాలంవరకు ఈ చక్కెరపైన ఎక్సయిజ్ సుంకాలు వేయకుండా వుంటే, ఈ పరిశ్రమ ఆర్థికంగా సౌష్ఠవాన్ని సాధించగలదని పేర్కొన్నట్టు తెలుస్తున్నది

ఆంధ్రప్రాంతంలో నీరానుంచి బెల్లం తయారుచేసే సంఘాలు 663 కలవు దాదాపు నాలుగువందల నీరా సంఘాలు కలవు.

మంత్రి శ్రీ అప్పారావు ప్రసంగిస్తూ మద్యనిషేధానికి అమలుపరచడమే కాంగ్రెస్ ప్రభుత్వవిధానమని, అందువల్ల నీరాసంఘాలు కల్లు అమ్ముకొనడానికి అనుమతించబోమని చెప్పినట్టు తెలుస్తున్నది.

నేటి సమావేశంలో నీరా సంఘాలను ఏమిచేయాలనే విషయం చర్చించబడింది గాని ఎలాంటి నిర్ణయం జరుగలేదట.

భోపాల్‌లో లారీ డ్రయివర్ల సమ్మె

విరమించాలని రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి

భోపాల్, అక్టోబర్ 18— భోపాల్‌లో సమ్మె చేస్తున్న లారీ డ్రయివర్లకు కొన్ని సౌకర్యాలు కలుగజేయగలమని అందుచేత వారు చేస్తున్న సమ్మెను వెంటనే విరమించాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం నిన్న ఇక్కడ ప్రకటన చేసింది.

మధ్యప్రదేశ్‌లో ఈ నెల ఒకటవ తేదీ నుంచి లారీ డ్రయివర్లు సమ్మె చేస్తున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సౌకర్యాలవల్ల, లారీ డ్రయివర్ల సమస్య ఇప్పుడే పరిష్కారమైనట్టు కాదని భావిస్తున్నారు.

రాష్ట్ర మోటారు యూనియన్ కాంగ్రెస్ కార్యదర్శి సంఘం ప్రభుత్వం చేసిన ప్రకటనలోని అంశాలను, పచ్చే శనివారం (అక్టోబర్ 20) ఇందోర్‌లో సమావేశమై సవరించి పరిశీలించగలదని తెలుస్తున్నది.

గుజరాత్‌లో సానుభూతి సమ్మె

మధ్య ప్రదేశ్ లారీ డ్రయివర్లు సమ్మెకు సానుభూతి సూచకంగా, గుజరాత్‌లోని 90 వంతుల మంది లారీ డ్రయివర్లు నిన్న ఒక రోజు సమ్మె చేసినట్టు అహమ్మదాబాద్‌లోని రాష్ట్ర లారీ అసోసియేషన్ ప్రధాన కార్యాలయం ప్రకటించింది.

ఢిల్లీలో సానుభూతి సమ్మె

న్యూఢిల్లీ, అక్టోబర్ 18—మధ్యప్రదేశ్ లారీ డ్రయివర్ల కోర్కెలను బలపరుస్తూ అఖిల భారత మోటారు యూనియన్ కాంగ్రెసువారి ఆధ్వర్యాన నిన్న ఇక్కడ లారీల సమ్మె జరిగింది. ఈ సందర్భంలో ఏర్పాటు చేసిన ఊరేగింపులో వందలాది లారీలు పాల్గొన్నవని.

సవరణ

నెల్లూరులో మొన్న 7 తేదీన కష్టమ్సు అధికారులు దొంగ సరకులను స్వాధీనంచేసిన కొన్ని సందర్భంలో కొన్ని స్థానిక హోటల్స్‌లో సోదా జరిగినట్టు "ఆంధ్రజ్యోతి" 10 వ తేదీ సంచికలో ప్రచురించింది. ఈ హోటల్స్‌లో శ్రీ రాఘవవిఠల్, అఖిలభారతాల్టులు లేవు కేవలం ప్రచురించిన వార్తలో పేరుపాటు వచ్చినందుకు చింతిస్తున్నాము—ఎడిటర్, ఆంధ్రజ్యోతి.

ఎన్. జి. ఓ. లకు దీపావళి అడ్వాన్సు

మంజూరుచేస్తూ ప్రభుత్వ ఉత్తర్వు

హైదరాబాద్, అక్టోబర్ 18—నెలకు 220 రూపాయలకు మించిన జీతం తీసుకొంటున్న ప్రభుత్వ నాన్‌గెజిటెడ్ ఉద్యోగులకు ఏడాదికి ఒకసారి పండుగల సందర్భంలో అడ్వాన్సు యిచ్చేందుకు ఏర్పాటు వున్నది. ఈ పైకి పరిధులను పర్తించని వారి విషయంలో లోగడ కూడా 75 రూపాయలు దీపావళి అడ్వాన్సుగా యివ్వాలని ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు జారీ చేసింది.

జర్నలిస్టులకు రెండవ వేజ్‌బోర్డు

వెంటనే ఏర్పాటు చేయాలని హైదరాబాద్ సమావేశం తీర్మానం

హైదరాబాద్, అక్టోబర్ 18—నిన్నటిలో ఇక్కడ సమావేశమైన భారతీయ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య జాతీయ కార్యవర్గ సమావేశంలో, వర్కింగ్ జర్నలిస్టులకు రెండవ వేజ్‌బోర్డు ఏర్పాటు చేయడంలో చేస్తున్న ఆలస్యానికి నిరసన తెలుపుతూ తీర్మానించాడు. మూడురోజులపాటు జరిగిన భారతీయ వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య సమావేశంలో, చట్టంలో తెలుపబడిన విధంగా 1962వ సంవత్సరంలో రెండవవేజ్ బోర్డు ఏర్పాటు చేయబడగలదని ప్రభుత్వం చేసిన హామీ అమలుజరపడంలో ఆలస్యం జరుగుతున్నదని తెలియజేసింది.

రెండవ వేజ్ బోర్డు ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం సత్వర చర్యలు తీసికోవాలని భారత వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య విజ్ఞప్తి చేసింది.

కాకినాడలో ప్రకృతి ఆశ్రమం

ప్రారంభోత్సవం

కాకినాడ, అక్టోబర్ 18—ఈ నెల 14 వ తేదీన శ్రీ పైండా సూర్యనారాయణమూర్తిగా రిచ్చిన విష్ణు సేవాశ్రమం తాలూకా భవనంలో డాక్టరు వి. వెంకట్రావు, (ప్లానింగ్ సబ్ కమిటీ ప్రకృతి సలహా సంఘ సభ్యులు, హైదరాబాద్ ప్రకృతి చికిత్సాలయ పర్యవేక్షకులు) శ్రీ సూర్య ప్రకృతి ఆశ్రమానికి ప్రారంభోత్సవం చేయబడింది డాక్టరు వేగిరాజు వేంకట రామరాజు ఈ ఆశ్రమ ప్రధాన వైద్యులుగా వ్యవహరిస్తారు.

ఈ సందర్భంలో రామచంద్రపురం తాలూకా పెదురుపాక సావరం కాపుదస్తులు శ్రీ సత్తిరాజు వెయ్యి రూపాయలు, కాకినాడపుర ప్రముఖులు శ్రీ బచ్చు పాపారావు వెయ్యి రూపాయలు, శ్రీ వలుమూరి రామమూర్తి వెయ్యి రూపాయలు ఈ ఆశ్రమానికి విరాళంగా ఇచ్చారు. కాకినాడపుర ప్రముఖులు ప్రకృతి వైద్యాభిమానులు అనేకమంది ఈ సభకు విచ్చేసి సుమారు పదివేల రూపాయలు విరాళము లిచ్చి ఆశ్రమ నిర్వాహకులు తోడ్పడిరి. ఈ ఆశ్రమ నిర్వాహణ కార్యభారాన్ని శ్రీ పైండా వెంకటనారాయణ జమీందారుగారు, శ్రీ దాట్ల వీరరాఘవరాజుగారు నిర్వహించారు.

పారిశ్రామికవేత్త మృతి

బొంబాయి, అక్టోబరు 18— ప్రముఖ పారిశ్రామికవేత్త, కాంగ్రెసుకు సర్ కోవాస్జీ జహాంగీర్ నిన్న రాత్రి 12-30 గంటలకు ఇక్కడ మరణించారు. ఈయన వయస్సు 83 సంవత్సరాలు. 1919 20 సంవత్సరంలో బొంబాయి మునిసిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడుగా పని చేశారు. 1930 నుంచి 1947వరకు ఈయన బొంబాయి శాసనసభ సభ్యులుగా వున్నారు. రౌండుటేబుల్ మహాసభలో భారతదేశం ప్రతినిధిగా పాల్గొన్నారు. పెక్కు పరిశ్రమలను నెలకొల్పడంలో ఈయనకు ప్రముఖస్థానం వున్నది.

వినియోగదారుల సహకార సంఘాలు

అత్యవసర వస్తువుల ధరలు స్థిరీకరణకు అవసరమని శ్రీ వి.టి. కృష్ణమాచారి వివరణ

మద్రాసు, అక్టోబర్ 18 — భారత జాతీయ సహకార సంఘ అధ్యక్షుడు శ్రీ వి. టి. కృష్ణమాచారి నేడిక్కడ మాట్లాడుతూ, అత్యవసర వస్తువుల ధరల స్థిరీకరణకై, రాష్ట్రాలలోను, పట్టణాలలోను పెద్దఎత్తున వినియోగదారుల సహకార సంఘాలు ఏర్పాటు కావలసిన ఆవశ్యకత కలదని చెప్పారు.

ప్రస్తుతం కొన్ని ప్రాంతాలకే ఈ ఉద్యమం పరిమితమై వున్నందుకు ఆయన తన నిరసన తెలియజేశారు.

ఇక్కడ రాజాజీ హాలులో నేటి ఉదయం సహకారంపై దక్షిణ ప్రాంతీయ గోష్ఠిలో ఆయన ప్రసంగిస్తూ, రానున్న సంవత్సరాలలో సహకారోద్యమాన్ని విస్తరింప చేస్తూ, అశ్రద్ధ, అక్రమ యాజమాన్యంవల్ల కలిగే నష్టాలను నిరోధించి, ఉన్నత సామర్థ్యాన్ని, సమైక్యాన్ని పెంపొందింప చేయాలని ఆయన ఉద్బోధించారు.

రాష్ట్ర గవర్నర్ శ్రీ విష్ణురామ్ మేధీ రెండు రోజులపాటు జరిగే ఈ గోష్ఠికి ప్రారంభోత్సవం చేస్తూ, సామాన్య మానవుని శేయస్సు దృష్టిలో వుంచుకొని, దేశ ఆర్థిక వ్యవస్థను పెంపొందింప చేయడానికై ఉత్పత్తి, సంపత్తి కార్యక్రమాలలో సహకార విధానం అమలుజరపాలని సూచించారు.

శ్రీ కృష్ణమాచారి తన ఉపన్యాసాన్ని కొనసాగిస్తూ, 1963 సంవత్సరం నాటికి అన్ని రాష్ట్రాలలోను పంచాయతీ రాజ్యం స్థాపించిన తరువాత, సహకారవృద్ధి ఉద్యమంలో భాగంగా రూపొందేటట్టు, సహకారోద్యమాన్ని పునర్నిర్మించాలని అన్నారు.

యువకులు యువతులు సహకారోద్యమంలో ప్రముఖ పాత్ర వహించాలని, పశ్వవిద్యాలయాలు, కళాశాలలు సెకండరీ పాఠశాలలలో సహకార శాస్త్రం బోధనాభాగం ప్రవేశపెట్టేటట్టు ప్రోత్సహించాలని ఆయన చెప్పారు. విద్యా సంస్థలలో, విద్యార్థుల నిర్వహణలో సహకార సంఘాల ఏర్పాటు కావాలని శ్రీ కృష్ణమాచారి అన్నారు.

కేంద్ర ప్రభుత్వం పరిశీలన

బెంగుళూరు, అక్టోబర్ 18 — దేశంలో వినియోగదార్ల సహకార సంఘాల ఉద్యమానికి ఆర్థిక సహాయం చేసే విషయమై కేంద్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నదని, కేంద్ర సహకార శాఖ ఉప మంత్రి శ్రీ ఎన్. డి. మిశ్రా నిన్న ఇక్కడ పత్రికలవారితో మాట్లాడుతూ చెప్పారు. ఈ విషయమై కొద్దిరోజులలోనే ఒక నిర్ణయం చేయగలరని కూడా ఆయన తెలియజేశారు.

అత్యవసర వస్తువుల ధరలను అదుపు చేయడానికి, ప్రతి రాష్ట్ర రాజధానిలోను, ప్రభుత్వోద్యోగుల అవసరాలకై వినియోగదార్ల సహకార సంఘాలను స్థాపించాలని నిర్ణయించామని తెలిపారు.

ఈ పథకం కింద ప్రతిరాష్ట్ర రాజధానిలో ఒకపెద్ద బోకుడిపో ఏర్పడగలదని. నగరంలోని ప్రధానమైన కేంద్రాలలో చిల్లర దుకాణాలు వుండగలవని చెప్పారు.

పరిశ్రమలు, రవాణా, పాలసరఫరా, మత్స్య, గృహ నిర్మాణరంగాలలో సహకార పథకాన్ని ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం నిశ్చయించినదని మంత్రి తెలియజేశారు.

ఇండియా, చైనా సరిహద్దు సమస్య

ఉత్తర ప్రదేశ్ అసెంబ్లీలో చర్చకు అనుమతి నిరాకరణ

లక్నో, అక్టోబర్ 18—తూర్పు సరిహద్దు ప్రాంతంలో ఇండియా-చైనా సరిహద్దు సమస్యను గురించి చర్చించాలని కోరుతూ వాయిదా తీర్మానాన్ని ప్రవేశపెట్టడానికై వచ్చిన నోటీసును ఉత్తర ప్రదేశ్ శాసన సభ స్పీకర్ శ్రీ మదన్ మోహన్ వర్మ నిరాకరించారు.

అటువంటి విషయాలపై సభలో చర్చ జరిగినట్లయితే, సభ్యులు తమ పరిధులను అతిక్రమించి మాట్లాడడం సంభవించగలదని, అంతేగాక వార్తా పత్రికలలోని సమాచారాన్ని ఆధారం చేసుకొని సరిహద్దు సమస్యలపై చర్చ జరపడం సాధ్యపడదని స్పీకర్ వివరించారు.

ప్రతిపక్ష నాయకుడు శ్రీ యాదవేంద్ర దత్తా దుబే ముఖ్యమంత్రికి ప్రధాని నెహ్రూ నుంచి ఒక లేఖ వచ్చినదని చెప్పారు. అటువంటి పరిస్థితిలో ప్రజాభిప్రాయాన్ని తెలుసుకొనడానికి చర్చకు అంగీకరించడం ప్రభుత్వ ధర్మమని. 1959 లో ఇటువంటి చర్చకు అనుమతించడం జరిగిందని అన్నారు.

స్పీకర్ శ్రీ వర్మ సరిహద్దులో 1959 నాటికంటె ఇప్పటి పరిస్థితి చాల తీవ్రంగా వున్నదని, రాజకీయ పక్షాల నాయకులు ముఖ్యమంత్రిని కలుసుకొని చర్చించడం వుచితమని సూచించారు.

న్యూయార్క్, అక్టోబర్ 18—సమితి ఆధ్వర్యంలో ప్రపంచ వాణిజ్య మహాసభ జనరల్ అసెంబ్లీ ఆర్థిక వ్యవహారాల సంఘంలో ఇండియా ప్రతినిధి శ్రీ టి. ఎన్. చక్రవర్తి నూరంతారు.

కామన్ మార్కెటు అవతరణలో అభివృద్ధి చెందిన దేశాలు, వెనుక బడిన దేశాల మధ్య వాణిజ్యం సమస్య ప్రాధాన్యం వహించిందని అయన అన్నారు.

దినవాక్యం

నానాటికి పెరుగుతున్న భిక్షుక సమస్య

నానాటికి యాచకుల సంఖ్య పెరుగుతున్నది. హోటల్స్ వద్దగాని, చిల్లర కొట్ల వద్దగాని, కూరగాయల కొట్ల వద్ద యాచకులు ఎక్కువయ్యారు. యాచకులలో నూటికి 70 మంది పనిచేయగలవారు. వారిలో చాలామంది కూలిచేయుటకు బద్ధకము గనుక ముష్టిభక్షముగ సంపాదించవచ్చునని యాచించుట మొదలుపెట్టారు. మిగిలిన వారు గుడ్డివారు, టిలో కుష్ఠురోగులు కూడా బస్తీలోని బజారులలో యాచించుచున్నారు. వారిని వేరు ప్రదేశములలో వుంచక బజారులలో తిరుగనీయడం ప్రమాదకరం.

కావున ప్రభుత్వమువారు దీనినిగ్రహించి భిక్షక సమస్య నిర్మూలనకు తగువర్యలు తీసుకొనగలరని ఆశిస్తున్నాను.

బి మనోరంజన్ చౌదరి,
గుడివాడ.

* * *

వీరవాసరం బస్సు స్టాండు

వీరవాసరంనుంచి భీమవరం, నరసాపురం, కోడేరు, తణుకు ప్రాంతాలకు ప్రయాణంచేసే ప్రయాణీకుల పరిస్థితి చాలా శ్రమతోకూడివుండడమే కాకుండా గంటల తరబడి బస్సుల కోసం వేచివుండవలసి వస్తున్నది. వర్షాకాలం మరీ కష్టంగావుంది.

ఆర్. టి. సి. వారు ఇక్కడ విశ్రాంతిశాలగాని, మరుగుదొడ్లుగాని ఏర్పాటుచేయలేదు. ఇటువంటిపరిస్థితులలో ప్రయాణీకులు, ముఖ్యంగా స్త్రీలు ఎటువంటి ఇబ్బందులకు గురికావలసి వస్తుందో చెప్పనవసరంలేదు

కనుక, వీరవాసరం బస్సు స్టాండులో విశ్రాంతిశాల, మరుగుదొడ్లు ఏర్పాటుచేసి ప్రయాణీకులకు సౌకర్యం కలుగజేయవలసిందిగా రోడ్డు ట్రాన్సు బోర్డు అధికారులను కోరుతున్నాను.

నిమ్మల వెంకటరెడ్

రాజ్యలక్ష్మివారి "రక్త సంబంధం" చిత్రంలో కాంతారావు, సావిత్రి

చిత్ర జ్యోతి

తెలుగు చిత్ర వార్తలు

చెక్ సహకారంతో "మహాభారతం" చిత్రం నిర్మాణం

బిమల్‌రాయ్ సన్నాహాలు

మహాభారత కథను చెకోస్లొవాక్ ఫిలిం ఎక్స్‌పోర్ట్ సంస్థ సహకారంతో వర్ణ చిత్రంగా తీయడానికి ప్రముఖ దర్శక-నిర్మాత బిమల్‌రాయ్ సన్నాహాలు చేస్తున్నారు.

లోకార్నో అంతర్జాతీయ తొలి చిత్రోత్సవాలలో ఫిలిం ఎక్స్‌పోర్ట్ సంస్థ డైరెక్టర్ శ్రీ కచిన్‌ను కలుసుకొన్నప్పుడు బిమల్‌రాయ్ ఈ మేరకు ఒక సూచన చేశారు.

యూనెస్కో సంస్థలో ట్రిక్ ఫొటోగ్రఫీ లోను, పౌరాణిక చిత్రాల నిర్మాణంలోను పేరెన్నికగన్న చెక్ తొలి చిత్ర దర్శకుడు జెమెన్ సహకారాన్ని ముఖ్యంగా పొందాలని బిమల్‌రాయ్ ఆశిస్తున్నారు.

ఇటీవలే శ్రీ కచిన్ రాయ్ సూచనకు తన ఆమోదాన్ని తెలుపుతూ జెమెన్ కూడా సహకరించడానికి అంగీకరించారని కేబుల్ యిచ్చారు.

"ప్రేమపత్ర" చిత్రం ఇటీవలే పూర్తయి విడుదల అయినందువల్ల మహాభారతం చిత్రాన్ని రాయ్ త్వరలోనే చిత్రీకరించవచ్చును.

పాక్ చిత్రాల దిగుమతికి నిరసన

భారత ప్రభుత్వం పాకిస్తానీ చిత్రాలను దిగుమతి చేసుకొనడానికి అనుమతించినందుకు భారతీయ తలనచిత్ర నిర్మాతల సంఘం (ఇంపా) తన నిరసన తెలియజేసింది.

పాక్ ప్రభుత్వం భారతీయ చిత్రాలపై పూర్తిగా నిషేధాన్ని విధించినా భారత ప్రభుత్వం ఈ వైఖరిని అవలంబించడం అనుచితమని సంఘం పేర్కొన్నది.

మన చిత్రాల ప్రదర్శనను పాక్ ప్రభుత్వం బహిష్కరించినప్పుడు వారిచిత్రాల దిగుమతిని కూడా మనం నిషేధించాలని గత సంవత్సరం ప్రభుత్వాన్ని కోరడం జరిగినదని సంఘం ప్రతినిధి తెలియజేశారు.

బెర్లిన్ చిత్రంలో భారతీయ విద్యార్థి

ఆంగ్ల దర్శకుడు పాల్ డిక్సన్ బెర్లిన్ పరిస్థితిని గురించి తీసిన "ఎ స్టూడెంట్ ఇన్ బెర్లిన్" అన్న చిత్రంలో బెర్లిన్‌లోని టెక్నికల్ యూనివర్సిటీలో చదువుతున్న భారతీయ విద్యార్థి ప్రవీణ్ కొటికర్ ప్రముఖ పాత్రను ధరించారు.

సినిమా ఉద్యోగులకు కనీస వేతనాలు

వెంటనే అమలుజరపాలని వరంగల్ యూనియన్ విజ్ఞప్తి

వరంగల్, అక్టోబర్ 18 — ఈ నెల 15 వ తేదీన వరంగల్ సినిమా వర్కర్స్ యూనియన్ సర్వసభ్య సమావేశం సంఘాధ్యక్షులు శ్రీ యం. యాదగిరి అధ్యక్షతన పట్టణ కాంగ్రెసు కమిటి కార్యాలయంలో జరిగింది. ఈ క్రింది తీర్మానాలు ఆమోదించారు.

ప్రభుత్వం సినిమా పనివారలకు నిర్ణయించిన కనీస వేతనాలు వెంటనే అమలుజరచాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఈ సమావేశంలో తీర్మానించారు.

లక్ష్మి, విజయా, జి. ఆర్. టాకీసుల పనివారలకు బోనసు యిప్పించుటకు లేబర్ ఆఫీసరుకు అర్జీ పెట్టకోవాలని వేరొక తీర్మానం చేశారు.

సినిమా పనివారలకు కనీస వేతనములు అమలుజరిపేటందుకుగా కోసంకై కార్మిక శాఖ మంత్రి, లేబర్ కమిషనర్‌ల వద్దకు రాయబార వర్గాన్ని పంపాలనికూడా ఈ సమావేశం తీర్మానించింది. సంఘ కోశాధ్యక్షులు జలరాం రాజీనామాను అంగీకరిస్తూ, శ్రీ పి. సోమలింగంను అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

అఖిలభారత న్యాయశాస్త్ర అధ్యాపకుల మహాసభను వచ్చే డిసెంబర్‌లో అలహాబాద్‌లో జరిపవలసిందిగా ఆహ్వానించడానికి అలహాబాద్ యూనివర్శిటీ నిర్వహణ సంఘం నిశ్చయించింది.

నాలుగు కెనెడియన్ చిత్రాలు

విజయవాడలోని చలన చిత్ర సంఘం వార్షిక సర్వసభ్య సమావేశం రేపు 21 వ తేదీన విజయటాకీస్‌లో జరుగనున్నది. ఆ సందర్భంలో సంఘం తరపున నాలుగు కెనెడియన్ చిత్రాలను సభ్యులకు చూపించనున్నారు. వాటిలో మొదటిది "ఏంజెల్ ఫేస్" (కుర్చీ కథ).

ఒకతను చదువు కొంటూ ప్రక్కనే వున్న కుర్చీలో కూర్చొన బోతాడు కాని ఆ కుర్చీ పట్టి ఆకతాయి. ఆతనిని ముప్పతిప్పలు పెట్టి మూడు చెడుపుల నీళ్లు తాగించి చివరకు లొంగిపోతుంది.

ప్రముఖ భారతీయ సితార్ వాద్యగాడు రవి శంకర్, తబుర్‌లాల్ (తబల) మధుసూదన్ (తంబుర) లు ఈ చిత్రానికి వినసొంపయిన సంగీతాన్ని సమకూర్చారు.

రెండవ చిత్రం "సాంగ్ ఆఫ్ నోవా స్కోషియా"

ఈ చిత్రంలో హెలెన్ క్రెయిటన్ అనే ఆమె కెనడాలోని జానపద గేయాలను ఉదూరా ఇంటింటా తిరిగి సేకరిస్తుంది. ఆమె సేకరణలు కెనడాలో బహుళ ప్రచారాన్ని పొందాయి.

మూడవ చిత్రం "జోలీపోఇన్" ప్రముఖ దర్శకుడు కార్నిలిస్ క్రెయిగి చిత్రాల ఆధారంగా కొన్ని పండల సంవత్సరాల క్రితం కెనడాలో ప్రజా జీవనం ఎలా వుండేదో ఈ చిత్రంలో చూపారు. దర్శకుడు నోలిన్‌లో చిత్రాల నన్నింటిని ఎడిట్‌కూర్చి ఒక కథగా రూపొందించడంలో మంచి ప్రతిభ చూపారు. క్రెయిగ్ చిత్రాలను చూస్తుంటే వాస్తవిక ప్రపంచంలో వున్నట్టే వుండి.

ఇక నాలుగవది "బ్లాంకిటీ బ్లాంక్" ఈ చిత్రంలో మనుషులు వుండరు. మాటలు వుండవు. ఏవేవో సంకేతాలు కన్పిస్తాయి వాటినే ఏదో ప్రాణులుగా భావించుకోవాలి అర్థం చేసుకునే వారికి ఈ చిత్రం చాలా బాగుంటుంది.

ఈ చిత్రానికి బ్రిటిష్ ఫిలిం అకాడమీ, కాన్స్, ఎడింబర్గ్, బెర్లిన్ అంతర్జాతీయ తలన చిత్రోత్సవాలలో 12 అవార్డులు వచ్చాయి.

ఈ నాలుగు చిత్రాలను కెనడా జాతీయ తలనచిత్ర సంస్థ నిర్మించింది.

వాతావరణం

మద్రాసు, అక్టోబర్ 18—రాగల 24 గంటలవరకు ఆంధ్రప్రదేశ్‌లో వాతావరణ సూచన: కోస్తా, రాయలసీమ జిల్లాలలోని అన్ని ప్రాంతాలలోనూ, తెలంగాణాలో అక్కడక్కడ ఒక మోస్తరు వర్షంకాని, ఉరుములతో కూడిన జల్లులుకాని పడవచ్చు.

రాజలక్ష్మి ప్రొడక్షన్స్‌వారి "రక్తసంబంధం" లో దేవిక

"నీలీ ఆంఖేం" లో అజిత్, హెలెన్

తెలుగు చిత్ర వార్తలు

వినాయక కవితి, దీపావళి మొదలగు చిత్రాలను తీసిన నిర్మాత శ్రీ కె. గోపాలరావు. శ్రీయుతులు ఇ. కోటేశ్వరరావు, ఎత్తపాటి రమణయ్య, అలాసాహెబ్ అనువారి భాగస్వామ్యంలో "పద్మజా ఫిలిమ్స్ బ్యానర్ క్రింద "శ్రీ సత్యనారాయణ మహాత్మ్యం" అనే చిత్రాన్ని నిర్మించబోతున్నారని తెలియవచ్చింది.

ఈ చిత్రంలో నటీనటులకి ఇంతవరకు ఎన్. టి. రామారావు, రేలంగి బుక్ అయ్యారు. నాయిక పాత్రకు జమునను ఎన్నిక చేయవచ్చునట.

మాటలు, పాటలు సముద్రాల సీనియర్ వ్రాశారు. సంగీతం ఘంటసాల. చిత్రాన్ని వచ్చే ఏప్రిల్‌లో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

పీటలమీద పెళ్ళి

బి. ఆర్. ప్రొడక్షన్స్‌వారు "పీటలమీద పెళ్ళి" అనే చిత్రాన్ని తీస్తున్నారు. దీనిలో జగ్గయ్య, జానకి, రమణారెడ్డి ప్రభృతులు నటిస్తున్నారు.

ఈ చిత్రానికి దర్శకులు జి. కె. మూర్తి, జి. ఎన్. స్వామి.

బాబూమూవీస్ ప్రొడక్షన్ నెం.2

"మంచి మనసులు" చిత్రాన్ని నిర్మించిన బాబూ మూవీస్ వారు ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలో నాగేశ్వరరావు నాయకుడుగా మరొక చిత్రాన్ని తీయబోతున్నారు. శ్రీ ఫిలిమ్స్ ద్వారా ఆంధ్రలో విడుదల కానున్న ఈ చిత్రానికి సంగీతాన్ని కె. వి. మహాదేవన్ సమకూర్చుతారు.

"పూజాఫలం" షూటింగ్

శంభూ ఫిలిమ్స్ బ్యానర్ క్రింద డి. లక్ష్మీనారాయణ చౌదరి నిర్మిస్తున్న "పూజాఫలం" చిత్రం షూటింగ్ ఇటీవలనే ప్రారంభమైనది. ఎన్. రాజేశ్వరరావు సంగీత దర్శకత్వాన్ని, బి. ఎన్. రెడ్డి దర్శకత్వాన్ని నిర్వహిస్తున్నారు.

ఈ చిత్రంలో అక్కినేని నాగేశ్వరరావు, సావిత్రి గమ్మత్తు, రమణమూర్తి, రేలంగి, రమణారెడ్డి మరియు ప్రభృతులు ముఖ్యపాత్రలను దరిస్తున్నారు.

మాటలు డి. వి. నరసరాజు. పాటలు కృష్ణశాస్త్రి; సి. నారాయణరెడ్డి; కొసరాజు.

సుఖదుఃఖాలు

కానుకొలను ప్రొడక్షన్స్‌వారు హైదరాబాద్ సారథి స్టుడియోలో "సుఖదుఃఖాలు" అనేచిత్రాన్ని నిర్మించబోతున్నారు మానవ జీవితాలను సుఖదుఃఖాలను మధించి మనోహరంగా చిత్రించబోయే ఈ చిత్రానికి తాండ్ర సుబ్రహ్మణ్యం రచన, రజనీకాంత్ దర్శకత్వం నిర్వహిస్తారు. ఇందులో ప్రముఖ

మురుగన్ బ్రదర్స్‌వారి "ప్రజాశక్తి" లో ఇ వి సరోజ

తారాగణంతో పాటు ఈదే కోటేశ్వరరావు జి. హుస్సేనప్పనాయుడు, కె. సత్యనారాయణ అను నూతన నటులు కూడా పాల్గొంటారని తెలుస్తున్నది. నిర్మాత కె. సుబ్రహ్మణ్యం.

సుఖదుఃఖాలు

కానుకొలను ప్రొడక్షన్స్‌వారు హైదరాబాద్ సారథి స్టుడియోలో "సుఖదుఃఖాలు" అనేచిత్రాన్ని నిర్మించబోతున్నారు మానవ జీవితాలను సుఖదుఃఖాలను మధించి మనోహరంగా చిత్రించబోయే ఈ చిత్రానికి తాండ్ర సుబ్రహ్మణ్యం రచన, రజనీకాంత్ దర్శకత్వం నిర్వహిస్తారు. ఇందులో ప్రముఖ

* హిందీ చిత్రజగత్తు

బొంబాయి (బొంబాయి)లోని రూప్ తారా స్టుడియోలో అనుపమా వారి ఈస్ట్‌మన్ కలర్ చిత్రం "దాదానా" షూటింగ్ ఇటీవల ప్రారంభమైనది. మహేష్ కౌల్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో నాయక నాయికలుగా రాజ్‌కపూర్, నయీరాబానూ నటిస్తున్నారు.

శైలేంద్ర, హస్రత్ జైపురీలు వ్రాసిన పాటలతో శంకర్—జైకిషన్‌లు సంగీతాన్ని సమకూర్చుతున్న ఈ చిత్రానికి త్యాగరాజ్ పెండర్కర్ ఛాయాగ్రాహకులుగా పనిచేస్తున్నారు.

అంజలీవారి చిత్రంలో వైజయంతిమాల

అంజలీపిక్చర్స్‌వారు తీస్తున్న కొత్త హిందీ చిత్రంలో ప్రధాన భూమికలను నిర్వహించడానికి వైజయంతిమాల, అశోక్ కుమార్ ఎన్నికైనారు. ఈ చిత్రానికి దర్శకుడు రచయిత ఇందర్‌రాజ్ ఆనంద్.

"కహోం బోర్‌చల్"

విజయ ఆనంద్ దర్శకత్వంలో బిమల్ మిత్ర తీస్తున్న "కహోం బోర్ చల్" చిత్రంలోని కొన్ని దృశ్యాలను ఇటీవల జార్‌వారి పార్క్‌వద్ద చిత్రీకరించారు.

దేవానంద్ ఆశా పరీఖ్‌లు ముఖ్య పాత్రలను ధరిస్తున్న ఈ చిత్రానికి సంగీత దర్శకులు శంకర్-జైకిషన్.

20 రోజులపాటు "గోవా" షూటింగ్

హాస్యనటుడు ఐ. ఎస్. జోహార్ నిర్మిస్తున్న "గోవా" చిత్రంలోని కొన్ని దృశ్యాలను 20 రోజులపాటు అవిరామంగా ఇటీవల చిత్రీకరించారు.

మెహమూద్, నిమీ, జోహార్, సప్రూ, ఉల్హాస్, ముస్రేమురాద్, సరితాసహానీలు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీత దర్శకులు కళ్యాణ్‌జీ, ఆనంద్‌జీలు.

గోయల్ చిత్రంలో జాయ్ ముఖర్జీ, సైరాబాను

గోయల్ సినీ కార్పొరేషన్ బ్యానర్ క్రింద దర్శక-నిర్మాత దేవేంద్రగోయల్ తీస్తున్న ఈస్ట్‌మన్ కలర్ చిత్రం "దూర్‌కి ఆవాజ్"లో నాయికా నాయకులుగా సయీరాబాను, జాయ్ ముఖర్జీలు నటిస్తున్నారు.

ఈ చిత్రానికి మాటలు ముఖ్తార్ శర్మ, పాటలు షకీల్ బదయూనీలు వ్రాయగా సంగీతాన్ని రవి సమకూర్చారు. ఓంప్రకాష్, దుర్గాఖోటే, జానీవాకర్, ప్రాణ్ ప్రభృతులు కూడా ఈ చిత్రంలో ఇతర పాత్రలను ధరిస్తున్నారు.

షర్మిల

బీస్ సాల్‌బాద్ చిత్రంలో ప్రేక్షకుల హృదయాన్ని చూరగొన్న ప్రముఖ సంగీత దర్శకుడు హేమంతకుమార్ గితాంజలి పిక్చర్స్ బ్యానర్ క్రింద తాను తీస్తున్న తొలి చిత్రానికి "షర్మిల" అని పేరు పెట్టారు.

షహీదారెహమాన్, ఉత్తమ కుమార్‌ల ముఖ్యపాత్రలను ధరిస్తున్న ఈ చిత్రానికి బిరేన్‌నాగ్ దర్శకత్వాన్ని, హేమంతకుమార్ సంగీత దర్శకత్వాన్ని నిర్వహిస్తున్నారు. ద్రువదట్టీ కథ ఆధారంగా తీస్తున్న ఈ చిత్రానికి పాటలు షకీలా బదయూనీ వ్రాస్తున్నారు.

"తేరే ఘర్ కే సామ్నే"

నవకేతన్‌వారి సంగీత హాస్య ప్రధాన చిత్రం "తేరే ఘర్ కే సామ్నే" లోని ఒక పాటకు సంగీత దర్శకుడు ఎస్. డి. బర్మన్ ఇటీవల బాణీని కూర్చారు.

దేవానంద్, నూతన్‌లు ముఖ్యభూమికలను, ఓంప్రకాష్, హరీంద్రనాథ్ ఛటోపాధ్యాయ, జగీరాలు ఇతర పాత్రలను ధరిస్తున్న ఈ చిత్రానికి హస్రత్ జైపురి పాటలను వ్రాస్తున్నారు.

ఏప్రిల్ ఫూల్

జంగ్లీ చిత్రాన్ని నిర్మించిన దర్శక నిర్మాత సుబోధ్ ముఖర్జీ "ఏప్రిల్ ఫూల్" అనే కొత్త ఈస్ట్‌మన్ కలర్ చిత్రాన్ని తీస్తున్నారు.

అహుడాసీకాశ్మీర్ మాటలను, శైలేంద్ర, హస్రత్ జైపురీలు పాటలను వ్రాస్తున్న ఈ చిత్రంలో సైరాబాను, విశ్వజీత్‌లు నాయికా నాయకులుగా నటిస్తున్నారు. సంగీతం శంకర్ - జైకిషన్.

"మేరీ షాదీ కర్నే చలా"

కాశ్మీర్‌కటాంజగార ఆధారంగా వాడియా బ్రదర్స్ నిర్మిస్తున్న మేరీ షాదీ కర్నే చలా చిత్రంలో సయీదాఖాన్, తబస్సుమ్, రాజేంద్రనాథ్, రాజ్‌కుమార్ బి.ఎస్. జోహార్, ప్రవీణ్ చౌదురి, మల్లిక ప్రభృతులు నటిస్తున్నారు.

డిసెంబర్‌లో విడుదలకానున్న ఈ చిత్రానికి సంగీత దర్శకుడు చిత్రగుప్త.

హాలిడే ఇన్ రంగూన్

మూవీ ఫేర్స్‌వారి "హాలిడే ఇన్ రంగూన్" ఈ నెలలో నెట్టవైకి వెళ్ళనున్నది. దైలేష్ కుమార్, రాణీ అలోక్‌కుమార్ లతో హెలెన్, వర్మ, రాండ్ ఉస్మానీ ప్రభృతులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతాన్ని చిత్రగుప్త సమకూర్చుతున్నారు.

"షమా" చిత్రంలో విజయదేవ్, విమ్మీ

(ఈ చిత్రాన్ని ఆంధ్రలో లైమ్‌లైట్‌వారు విడుదల చేయనున్నారు)

అమలాపురం కాలేజి సమ్మె పరిస్థితి

ఏడురోజులుగా విద్యార్థుల నిరాహారదీక్ష: కోనసీమలో సానుభూతి సమ్మెకు నిర్ణయం

("ఆంధ్రజ్యోతి" విలేకరి) అమలాపురం, అక్టోబర్ 18—

అమలాపురం కాలేజీకి చెందిన అయిదుగురు విద్యార్థులు నేటికి నిరాహారదీక్ష ప్రారంభించి ఏడు రోజులు అయింది. వారిలో ఒకరైన శ్రీ గరిమెళ్ళ లక్ష్మీనరసింహశాస్త్రి పరిస్థితి విన్న తీవ్రంగా పరిణమించింది ఈ రోజున కొంచెం కులాసాగా వున్నారు.

మిగిలిన విద్యార్థులు రాల నీరసంగా వున్నారు. వారి ఆరోగ్యాన్ని డాక్టర్లు పేరిశాస్త్రి, హరిహరస్వామి, సూర్యనారాయణగార్లు పరిశీలిస్తున్నారు.

నిన్న రాత్రి గాంధీపార్కులో కార్యకరణ సంఘ యాజమాన్యాన సభ జరిగింది. కాలేజీ యూనియన్ అధ్యక్షుడు శ్రీ పి. వెంకటరావు సభకు అధ్యక్షత వహించారు. ఈసభలో శ్రీయుతులు పేరిశాస్త్రి, ఏ. వీరరాఘవులు, ఎం. విశ్వేశ్వరరావు, ఆర్. వీరభద్రరావు గారలు మాట్లాడారు. విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్‌తో జరిపిన చర్చల గురించి వారు వివరించారు.

ఈ రోజు ఉదయం వల్లూరివారి సత్రంలో కోనసీమలోని ఉన్నత పాఠశాలల విద్యార్థి సంఘ నాయకుల సమావేశం జరిగింది. అమలాపురం హైస్కూలు యూనియన్ అధ్యక్షుడు శ్రీ వై. పూర్ణారావు సమావేశానికి అధ్యక్షత వహించారు.

అమలాపురం కాలేజీ సమ్మెను బలపరుస్తూ, ఒక రోజున సానుభూతి సమ్మె జరపడానికి ఈ సమావేశంలో నిశ్చయించారు.

ఈ నిర్ణయం ప్రకారం అమలాపురం, అంబాజీపేటలలో రేపు సమ్మె చేస్తారని ప్రకటించారు. మిగిలిన చోట్ల సమ్మె జరపడానికి ఇంకా తేదీ నిర్ణయం చేయలేదు.

ఈ రోజున అమలాపురం కాలేజీకి మొత్తం 889 మంది విద్యార్థులలో 12 మంది మాత్రమే హాజరయ్యారని తెలుస్తున్నది.

కళాశాల నిర్వహణను ప్రభుత్వానికి అప్పగించడానికి మేనేజిమెంట్ సుముఖత్వం

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

అంబాజీపేట, అక్టోబర్ 18—అమలాపురం కళాశాల వ్యవహారాలను గురించి విచారణ జరపడానికై మొన్న ఇక్కడకు వచ్చిన విద్యాశాఖ జాయింట్ డైరక్టర్ శ్రీ ఎల్. బుల్లయ్య కళాశాల కమిటీ సభ్యులను కలుసుకున్నారు.

కళాశాల కమిటీ యూనివర్సిటీతోచేసికొన్న ఒప్పందాన్ని అమలుజరపాలని లేదా కళాశాలను ప్రభుత్వానికి అప్పగించేటట్టు చూడాలని, కోరుతూ, వివిధరాజకీయ పక్షాలు సంస్థలు ఈ సందర్భంలో విద్యాశాఖ జాయింట్ డైరక్టర్‌కు మెమొరాండం సమర్పించారు.

నిన్న ఉదయం కళాశాల కమిటీలోని ఒక వర్గమైన శ్రీయుతులు జె. వి. బి. రామర్స్ కె. శ్రీరామమూర్తి, డాక్టర్ ఎం. సుబ్బారావు, జి సూర్యానారాయణగారలు విద్యాశాఖ జాయింట్ డైరక్టర్ విచారణ జరుపగోరించి, ప్రభుత్వంతో సంప్రతించి యూనివర్సిటీ ఏ నిర్ణయం చేస్తే దానిని అమలుజరపడానికి సిద్ధంగా వున్నామని శ్రీ బుల్లయ్యకు తెలియజేశారు. సిండికేట్ నిర్ణయాన్ని అనుసరించి కళాశాలను ప్రభుత్వానికి అప్పగించడానికి కూడా వారు తమ అమోదం తెలిపారు.

కళాశాల పాలకవర్గంలోని మరొక వర్గం శ్రీయుతులు ఎన్. రామభద్రరాజు, ఎన్. ఎ. రామచంద్రమూర్తి, ఆర్. రామచంద్రరావు గారలు, కళాశాల నిర్వహణను ప్రభుత్వానికి గాని, యూనివర్సిటీకి గాని అప్పగించడానికి పాలకవర్గం అంగీకరిస్తుందని జాయింట్ డైరక్టర్‌కు తెలియజేశారు.

ఈ విషయమై తీర్మానాన్ని అమోదించడానికై కార్యదర్శి వెంటనే సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేయగలరని తెలుస్తున్నది.

ప్రాథమిక, సెకండరీ పాఠశాలలో కేరళరాష్ట్రంలోని పాఠశాలలో ఉపాధ్యాయ సంఖ్యా వర్గాలకు మాతృభాషలో విద్యాబోధనకు అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం తీర్తరువు చేసినట్టు తిరువేంద్రం వార్త.

హైదరాబాద్ ఆయుర్వేద విద్యార్థుల సమస్య

పరిష్కారానికై విఫల యత్నం

హైదరాబాద్, అక్టోబర్ 18—ఆయుర్వేద విద్యార్థుల సమస్యను పరిష్కరించాలని కొందరు తెలంగాణా నాయకులు చేసిన ప్రయత్నాలు నిన్న విఫలమయ్యాయి.

ఈ సమస్యను పరిష్కరించాలనే ఉద్దేశంతో తెలంగాణా ప్రాంతీయ సంఘం అధ్యక్షులు శ్రీ టి. హయగ్రీవాచారి, శాసనసభ డిప్యూటి స్పీకర్ శ్రీ వాసుదేవనాయక్, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ జె. చొక్కారావు, శాసనమండలిసభ్యులు శ్రీ పి. నరసింగరావు, ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిని కలుసుకున్నారు.

కేంద్ర ప్రభుత్వం అంగీకరిస్తే జి. సి. ఐ యం విషయంలో తమ కెట్టి అభ్యంతరం లేదని, ఏదైనా ఆరోగ్య శాఖ మంత్రి తిరిగి వచ్చిన తదుపరి నిర్ణయించడం జరుగుతుందని ముఖ్యమంత్రి వివరించారు

శాసన సభ్యులు శ్రీ వావిలాల గోపాలకృష్ణయ్య ఒక ప్రకటన చేస్తూ ప్రభుత్వం మానవతా దృక్పథం ప్రదర్శించి ఆయుర్వేద విద్యార్థుల సమస్యను వత్రిమంగా పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు.

నిరశన వ్రతం చేస్తున్న అయిదుగురు విద్యార్థులను నిన్న పోలీసులు ఉస్మానియా ఆసుపత్రిలో జేర్చారు, అయితే, మరో యిద్దరు విద్యార్థులు నిరశన వ్రతం పూనారు.

విద్యార్థుల కోర్కెలు ఆమోదించాలని జనసంఘ కార్యదర్శి ప్రకటన

వరంగల్, అక్టోబర్ 18—ఆంధ్రప్రదేశ్ జనసంఘ కార్యదర్శి శ్రీ యల్. యస్. రాజు ఒక ప్రకటన చేస్తూ ఇద్దరు ఆయుర్వేద వైద్య విద్యార్థుల కోర్కెలను ప్రభుత్వం ఆమోదించాలని కోరారు.

ఆయుర్వేద వైద్య విద్యార్థుల కోర్కెలు సమంజసమైనవని, కాగా హైదరాబాద్‌లో నిరాహారదీక్ష వహించిన ఆయిదుగురు విద్యార్థులు వరంగల్‌లో ఇద్దరి విద్యార్థుల ప్రాణాలను కాపాడాలని ఆయన పై ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

యూనివర్సిటీ విద్యార్థులకు కంట్రాక్టర్ క్షమాపణ

వాల్తేరులో సంఘటన

విశాఖపట్నం, అక్టోబర్ 18—ఆంధ్ర విశ్వవిద్యాలయంకు చెందిన 300 మంది విద్యార్థులు నిన్న రాత్రి విశ్వవిద్యాలయ కంట్రాక్టరు యిటిపై రాళ్ళు దన్నగా అర్థాలు పగిలాయని, లారీలు మున్నగు వాటికికంటా నష్టం వాటిల్లినదని తెలుస్తున్నది

కంట్రాక్టర్ కొడుకు ప్రోత్సాహంతో సినిమాహాల్ వద్ద ఒక విద్యార్థిని అవమానపర్చి కొట్టారని, అందుపై విద్యార్థులు కోపోద్రిక్తులయ్యారని అంటున్నారు.

కళాశాల ప్రిన్సిపాల్ పోలీసు సూపరింటెండెంట్, కంట్రాక్టరు విద్యార్థుల ప్రతినిధుల సమావేశాన్ని జిల్లాకలెక్టరు ఏర్పాటుచేశారు కంట్రాక్టరు తమ కుమారుని తరపున విద్యార్థులకు క్షమాపణ చెప్పినారని కూడా తెలుస్తున్నది.

కొత్తగూడెంలో గనిపనివారల భద్రతాసప్తాహం

కొత్తగూడెం, అక్టోబర్ 18—గనిపని ప్రమాదభూయిష్టమైన వృత్తికావడం చేత దానిలో జరిగే ప్రమాదాలను సాధ్యమైనంత వరకు నివారించాలనే ఉద్దేశ్యంతో భారతదేశంలోని వివిధ గనులలో గనుల చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆదేశం ప్రకారం భద్రతా సప్తాహాలు జరుపబడుతున్నాయి

ఇట్టి సప్తాహాలు సింగరేణి కాలరీలో అక్టోబర్ ఒకటవ తేదీనుంచి 7 వ తేదీవరకు జరుపబడ్డాయి. కార్మికులలో భద్రతా దృక్పథాన్ని పాదుకొల్పేందుకు నాటకాలు, బుర్రకథలు, గొల్లసుద్దులు మొదలైన వైజ్ఞానిక పద్ధతుల ద్వారా ప్రయత్నం చేయబడింది

ఈ భద్రతాసప్తాహ సందర్భంలో కొత్తగూడెంలోని ఏడుగనులవద్ద భద్రతాసప్తాహ సందేశాన్ని సూచించేటట్టి శోభాయమానంగా అలంకరించబడ్డాయి. గనులలో ప్రమాదాలనుంచి తప్పించుకోడానికి మేమేసమయాలలో మే మే రక్షణపరికరాలు ఉపయోగించవలసినదీ తెలియజేస్తూ గని అధికార్లు కార్మికులకు వివరించి చెప్పారు. అట్టి పరికరాలను భద్రతాసప్తాహ ప్రదర్శనశాలలో ప్రదర్శించారు. ఉదయం బడిపిల్లలూ, కార్మికులూ కలిసి రక్షణ ప్రాముఖ్యతను తెలియజేసే పాటలు పాడుకొంటూ వీధులలోఊరేగింపులు సాగించారు. కార్మికులు బొగ్గును త్రవ్వేటప్పుడు చెప్పులలేకుండా బొగ్గునుత్రవ్వే అలవాటును తగ్గించుకోవాలని కోరుతూ గని అధికార్లు 'సేఫ్టీబూట్లు' ఉపయోగాన్ని విపులంగా వివరించారు. 'సేఫ్టీబూట్లు' సగంధరకు అమ్మకాలు సాగించారు.

చిరకాలం రక్షణతో పనిచేసిన సీనియర్ కార్మికులకు అయా గనులవద్ద ఈ భద్రతా సప్తాహ సందర్భంలో వివిధ బహుమతులు సమర్పించబడ్డాయి. చిరకాలం ప్రమాదాలు జరుగకుండా పనిచేసిన గనులకు కూడా బహుమతులు ఇవ్వబడ్డాయి.

ఈ గని భద్రతా సప్తాహాలు జరిగిన కొత్తగూడెంలోని గని ప్రాంతం కార్మికుల వైజ్ఞానిక కార్యక్రమాలతో కళకళలాడింది ఈ ఏడు రోజులూ కార్మికులు ప్రదర్శించిన నాటకాలకు, నాటికలకు వేల కొలది కార్మికులు వారి కుటుంబాలతోసహా హాజరైనారు.

ఈ భద్రతా సప్తాహ సందర్భంలో అఖిలభారత గనుల డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీ భద్వార్, రీజనల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ మైన్స్ శ్రీ గంగూలీ ఇక్కడకు వచ్చి, కార్యక్రమాలను తిలకించారు.

కొత్తగూడెం డిప్యూటీ జనరల్ మేనేజర్ శ్రీ బి. జి. ప్రదాన్, ధన్‌బాద్ డివిజన్ ఏజంటు శ్రీ టి ప్రసాద్, వివిధ గనుల మేనేజర్లు, వెల్ఫేర్ ఆఫీసర్లు ప్రత్యేక శ్రద్ధతో ఈ భద్రతా సప్తాహాన్ని జయప్రదం చేశారు.

తూర్పు గోదావరి జిల్లా చేనేత కాంగ్రెసు

సత్వరమే రిబేట్ చెల్లించాలని కేంద్ర సంస్థకు విజ్ఞప్తి

రాజమండ్రి, అక్టోబర్ 18 — తూర్పు గోదావరిజిల్లా చేనేత కాంగ్రెసు కార్యవర్గం శ్రీ దాసిన వెంకటరత్నం అధ్యక్షతను రాజమండ్రిలో ఈ నెల 12 వ తేదీన జరిగింది.

తూర్పుగోదావరి జిల్లాకు రావలసిన కొన్ని లక్షల రూపాయల రిబేటు అఖిల భారత చేనేత సంస్థ మంజూరు చేయనందున, ప్రాథమిక చేనేత సహకార సంఘాలు ఆర్థికంగా చాల బాధపడ్తున్నవని, కావున ఆ సొమ్మును త్వరితంగా మంజూరు చేయించి యిప్పించవలసిందిగా ఢిల్లీలోని చేనేత మంత్రిత్వశాఖను అభ్యర్థించారు.

మిల్లు యజమానులు నూలును సరసమైన రకాలు చేనేత సహకార సంఘాలకు సంతృప్తికరంగా సరఫరా చేయకపోవడం వల్ల ఈ పరిశ్రమకు కల్గిన దుర్భర దుస్థితి విషయంలో, నూలు రకాల పెరుగుదల విషయంలో ప్రభుత్వం తగు చర్యను తీసికొనలేదని, నూలు సరఫరా ధరలు వగైరా కంట్రోలును సరిగా అమలు పరచలేనప్పుడు, వెంటనే రద్దు చేయడం శ్రేయస్కరమని తీర్మానించారు.

మొన్న హైదరాబాద్‌లో సమావేశమైన చేనేత పారిశ్రామిక - నూలు మిల్లుల యజమాన్యుల - ప్రభుత్వ త్రైపాక్షిక సమావేశం సరిస్తేన పర్దయాలు తీసుకొని వెంటనే అమలు జరిపించకపోతే ఆకలి యాత్రలు జరుపవలసి వస్తుందని తీర్మానించారు.

అల్లిక చేనేత పరిశ్రమం, బొడ్డు శివరామయ్య, తల్లా రాజారావు చర్చలలో పాల్గొన్నారు.

తేలప్రోలులో రైతు కూలీల సమావేశం

హనుమాన్‌జంక్షన్, అక్టోబర్ 18—గన్నవరం తాలూకా వీరవల్లి ఫిర్కా రైతు, వ్యవసాయ కార్మిక జనరల్‌వాదీ సమావేశం తేలప్రోలు సినిమా హాలులో శ్రీ మానికొండ సుబ్బారావు అధ్యక్షతను జరిగింది. 20 గ్రామాలనుంచి వచ్చిన 600 మంది సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి ప్రతిపక్ష నాయకులు శ్రీ పుచ్చలపల్లి స

"మెక్‌మహన్ శ్రేణి ఇండియా సరిహద్దు"

దాని రక్షణకు ప్రభుత్వం తీసుకొనే చర్యలు సమర్థనీయమని కమ్యూనిస్టుపార్టీ ప్రకటన

ఈశాన్య సరిహద్దు సంఘటనలపట్ల పార్టీ సెక్రటేరియట్ ఆందోళన

న్యూఢిల్లీ, అక్టోబర్ 17—

ఈశాన్య సరిహద్దులో జరుగుతున్న సంఘటనలపట్ల భారత కమ్యూనిస్టుపార్టీ సెక్రటేరియట్ నేటి రాత్రి తన ఆందోళనను వ్యక్తపరుస్తూ, మెక్‌మహన్ శ్రేణి ఇండియా సరిహద్దు అని తమ పార్టీ ఎపుడూ చెబుతున్నదని, దాని పరిరక్షణకు తీసుకొనే చర్య లన్నీ సమర్థనీయమని తెలిపింది.

కమ్యూనిస్టుపార్టీ సెక్రటేరియట్ మూడు రోజుల సమావేశం నేడిక్కడ ముగిసిన సందర్భంలో ఈ మేరకు ఒక తీర్మానాన్ని చేయడం జరిగింది.

సరిహద్దుల రక్షణకు అవసరమైన చర్యలను తీసుకొంటూ, చైనాలో సంప్రతింపులు జరపడానికి భారత ప్రభుత్వం చేసే ప్రయత్నాలను బలపరచగలమని పార్టీ జాతీయ సమితి హైదరాబాద్‌లో ఆమోదించిన తీర్మానాన్ని 200 పదాలుగల ఈ తీర్మానంలో ప్రస్తావించారు.

చైనీయులు మెక్‌మహన్ శ్రేణిని దాటి భారత భూభాగంలోకి చొచ్చుకువచ్చారని భారత ప్రభుత్వం ప్రకటనలద్వారా తెలుస్తున్నదని, మెక్‌మహన్ శ్రేణి ఇండియా సరిహద్దు అని కమ్యూనిస్టుపార్టీ మొదటినుంచి చెబుతున్నదని, అందువల్ల సరిహద్దు రక్షణకు సమర్థవంతమైన చర్యలను తీసుకొనడం సమంజసమని తీర్మానంలో పేర్కొన్నారు.

తూర్పు సరిహద్దులో ఇండియా, చైనాల మధ్య మెక్‌మహన్ రేఖ స్పష్టంగా గుర్తించబడినందువల్ల అక్కడ దేమి అల్లర్లు లేవని సెక్రటేరియట్ అభిప్రాయపడినదని తీర్మానంలో వివరించారు.

ఈశాన్య సరిహద్దులో చైనీయులు మెక్‌మహన్ శ్రేణిని అతిక్రమించారని పార్టీ భావిస్తున్నదా అన్న ప్రశ్నకు ప్రధాన కార్యదర్శి శ్రీ ఇ. ఎం. ఎస్. నంబూద్రిపాద్ సమాధానమిస్తూ, అతిక్రమణ జరిగినదా లేదా అన్న విషయాన్ని నిర్ణయించవలసినది ప్రభుత్వమని, మెక్‌మహన్ రేఖ పరిరక్షించబడాలని తాము కోరుతున్నామని చెప్పారు.

ఈశాన్య సరిహద్దులో చైనీయులు భారత భూభాగంలోకి చొచ్చుకొని వచ్చారన్న ఇండియా ఆరోపణలో చైనా ఖండనను తీర్మానం సమానం చేసినదని ఒక విలేకరి చెప్పగా మన ప్రభుత్వం చెప్పిన విషయంపై తాము ఆధారపడతామని, అయితే వాస్తవానికి మెక్‌మహన్ రేఖను అతిక్రమించలేదని చైనా వాదించినదని ఆయన అన్నారు.

మెక్‌మహన్ రేఖను చైనా ఎన్నడూ గుర్తించలేదని మరొక విలేకరి చెప్పగా, తాము దానిని గుర్తించకపోయినప్పటికి దానికి దక్షిణంగా దురాక్రమణ జరుపబోవడం లేదని చైనీయులు పలుమార్లు ప్రకటించారని శ్రీ నంబూద్రిపాద్ తెలియజేశారు.

కమ్యూనిస్టుపార్టీ చైర్మన్ శ్రీ ఎస్. డాంగే మాట్లాడుతూ, తన దృష్టిలో చైనా వాదనను ఇండియా వాదానికి తీర్మానం సమం చేయలేదని చెప్పారు. మెక్‌మహన్ శ్రేణి అతిక్రమించబడినదని మాత్రం తీర్మానం పేర్కొంటున్నదని ఆయన అన్నారు.

"దురాక్రమణ తొలగేవరకు చర్చలు జరుపము" అన్న భారతప్రభుత్వం వైఖరితో పార్టీ ఏకీభవిస్తున్నదా అని అడుగగా, చర్చలకు ఎల్లపుడు అవకాశం వుండాలని అయితే ఆదేనమయంలో మన సరిహద్దు తప్పనిసరిగా పరిరక్షించబడాలని, అక్కడి పరిస్థితిని ఎదుర్కొనాలని శ్రీ డాంగే అన్నారు.

ఇదే ప్రశ్నకు శ్రీ నంబూద్రిపాద్ సమాధాన మిస్తూ ప్రతి దశలోను ప్రభుత్వం అవసరమైన చర్యలను తీసుకొంటుందని, తాము ప్రభుత్వం సాధారణ విధానాన్ని బలపరుస్తున్నామని చెప్పారు.

ఈశాన్య సరిహద్దు పరిస్థితిపై తీర్మానాన్ని ఓటింగ్‌కు పెట్టారా అని అడుగగా ఆయన సమాధాన మివ్వడానికి నిరాకరించారు.

అయితే పార్టీలోని చాలా పక్షంవారు మెక్‌మహన్ రేఖను అంతర్జాతీయ సరిహద్దుగా గుర్తించినప్పటికి చైనా దానిని అతిక్రమించినదన్న విషయాన్ని ఒప్పుకొనడం లేదని, అందువల్ల వామపక్షాన్ని వ్యాపింపకుండా వు దేశీలో ఈ తీర్మానం రూపొందించబడినదని అభిజ్ఞవర్గాలు తెలియజేస్తున్నవి

"పంజాబ్ గవర్నర్‌గా భానుప్రకాశ్ నియామకాన్ని ఉపసంహరించాలి"

పంజాబ్ గవర్నర్‌గా శ్రీ భగ్వాన్ భాను ప్రకాశ్ నియామకాన్ని ఉపసంహరించాలని కమ్యూనిస్టుపార్టీ సెక్రటేరియట్ నేడిక్కడ ఒక తీర్మానంలో కోరుతున్నది

ప్రస్తుత కేరళ మంత్రివర్గంచే రాజీనామా చేయించి తాజా ఎన్నికలకు ఏర్పాట్లు చేయాలనికూడా ఈ తీర్మానంలో సూచించారు.

కేరళ ప్రజాభీకం లేఖతెల్పినప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరుతున్నదా లేదా అన్న విషయాన్ని తెలుసుకొనడానికి కొత్తగా ఎన్నికలు జరపాలన్న కేరళ పార్టీ నిర్ణయాన్ని సెక్రటేరియట్ బలపరచింది.

కమ్యూనిస్టుపార్టీ కేంద్ర కార్యవర్గం నవంబర్ అయిదవ తేదీనుంచి ఎనిమిదవ తేదీవరకు ఇక్కడ సమావేశ మవుతుంది ఆ తర్వాత పార్టీ జాతీయ సమితి సమావేశ మవుతుంది.

గుండె జబ్బులకు పాము విషంద్వారా చికిత్స

పెనాంగ్ సంస్థ పరిశోధన

పెనాంగ్, అక్టోబర్ 17—హృదయంలో రక్తం గడ్డకట్టుకొని పోవడం, తదితర గుండె జబ్బులకు చికిత్స జరపడానికి పాము విషం ఉపయోగపడవచ్చునని నిన్న ఇక్కడ శాస్త్రజ్ఞులు చెప్పారు.

పాము విషంలోని కొన్ని భాగాలు రక్తం గడ్డకట్టుకొని పోకుండా చాలా సేపు నివారించగలిగినట్లు కనుగొన్నారని పెనాంగ్ పరిశోధన సంస్థ డైరెక్టర్ డాక్టర్ రీడ్ తెలిపారు

పాము విషంలోని ఇతర భాగాలను వేరుచేయడం గురించి పరిశోధన జరుగుతున్నదని, అది ఫలవంతమైతే గుండె జబ్బులకు చికిత్స చేయడానికి కొత్త పద్ధతిని కనుగొన వచ్చునని ఆయన అన్నారు.

న్యూయార్క్ కాటన్

న్యూయార్క్, అక్టోబర్ 17—

ఓపెనింగ్	...	33.49
క్లోజింగ్	..	33.56

ఈశాన్య సరిహద్దులో మంగళవారం రాత్రి తిరిగికొద్దిగా కాల్పులు

న్యూఢిల్లీ, అక్టోబర్ 17—

ఈశాన్య సరిహద్దులోని థాగ్లా రిడ్జ్‌కి దక్షిణంగా నిన్న రాత్రి ఒక భారతీయ గస్తీ కేంద్రానికి, చైనా దురాక్రమణదారులకు మధ్య కాల్పులు జరిగినవని ఇండియా విదేశ వ్యవహారాల మంత్రిత్వశాఖ ప్రతినిధి నేడిక్కడ ప్రకటించారు.

చైనీయులు ఒక ఇండియా స్థావరంపై చేతి బాంబును కూడా విసిరారని, అయితే భారతీయులెవ్వరు మృతి చెందడం గాని గాయపడడంగాని జరుగలేదని ఆయన అన్నారు.

అయిదు రోజులుగా ఎలాంటి సంఘటనలు లేకుండావున్న ఈశాన్య సరిహద్దుప్రాంతంలో మొన్న ఉభయం చైనీయులు కాల్పులు ప్రారంభించడంతో తిరిగి ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది.

చైనీయుల కాల్పులకు భారత దళాలు మరుసు కాల్పులు జరిపాయి.

సెలెక్టు కమిటీ సూచించిన రూపంలో వ్యవసాయ సంబంధాల చట్టం రెండవ సవరణ బిల్లును కేరళ అసెంబ్లీ అక్టోబర్ 15 వ తేదీన ఆమోదించింది.

ఉత్పత్తి వ్యయం పెరుగుదల

ధరలు హెచ్చడానికి కారణమని శ్రీయాన్స్ ప్రసాద్ జైన్ వివరణ

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

హైదరాబాద్, అక్టోబర్ 18—తమ అభిప్రాయాలకు ప్రజలు తగు విలువను ఇవ్వాలని వర్తకులు భావించినట్లయితే ముందు తమను తాము సంస్కరించుకొనాలని భారతీయ వాణిజ్య పరిశ్రమల మండలుల సమాఖ్య అధ్యక్షుడు శ్రీ శ్రీయాన్స్ ప్రసాద్ జైన్ నేడిక్కడ సలహా యిచ్చారు.

ఆంధ్రప్రదేశ్ వాణిజ్య, పరిశ్రమల మండలి తన గౌరవార్థం ఏర్పాటు చేసిన సభలో శ్రీ జైన్ ప్రసంగిస్తూ, వ్యాపారులు ఎక్కువగా లాభాలను పొందడంవల్లనే ధరలు పెరుగుతున్నాయన్న అభిప్రాయం ఒకటున్నదని, అయితే ఉత్పత్తి ఖర్చులు పెరిగినందువలనే ధరలు పెరిగాయన్నవిషయం మనవారలకు స్వానుభవమని అన్నారు.

ధరలు ఎందువల్ల ఆకాశాన్ని అంటుతున్నాయో వర్తకులు ప్రజలకు తెలియజేయాలని ఆయన సూచించారు.

ప్రభుత్వం, ప్లానింగ్‌కమిషన్‌లు ధరల పెరుగుదల విషయమై శ్రద్ధగ పరిశీలన జరుపుతున్నాయని, అందువల్ల అకారణంగా ధరలు పెరగకుండా చూసే బాధ్యత వర్తకులపై కూడా వున్నదని ఆయన అన్నారు.

వర్తకులకోసం శాసన సభ్యులు, పార్లమెంటు సభ్యులతో సన్నిహిత సంబంధాలను కలిగివుండి, ఎప్పటికప్పుడు వారి అభిప్రాయాలను తెలుసుకొనాలని, దేశఅభివృద్ధి కార్యక్రమాలలో వర్తకుల పాత్రను గురించి ప్రజలు తెలుసుకొనడానికి పత్రికల ద్వారా తగు ప్రచారం చేయాలని ఆయన సూచించారు.

అంతకుముందు శ్రీ జయచంద్ లోహాడే స్వాగతం చెప్పారు.

రష్యాచే కొత్తరకం రాకెట్ల ప్రయోగం

పసిఫిక్‌లో నిర్వహించినట్టు టాస్ ప్రకటన

మాస్కో, అక్టోబర్ 17—రష్యా, పసిఫిక్ ప్రాంతంలో అనేక అంచెలో వెళ్ళే కొత్తరకం రాకెట్ల ప్రయోగాన్ని జరిపినదని టాస్ వార్తాసంస్థ నేడు ప్రకటించింది.

ఈ రాకెట్లు 7,500 మైళ్ళ దూరం ప్రయాణం చేస్తాయి. కాస్మిక్ అజ్ఞేయ సాధనకు ఈ ప్రయోగం జరుగుతున్నదని టాస్ వివరించింది.

రష్యాచే కాస్మాస్-10 ఉపగ్రహం ప్రయోగం

మాస్కో, అక్టోబర్ 17—సోవియెట్ యూనియన్ నేడు కాస్మాస్-10 అనే మరొక ఉపగ్రహాన్ని ప్రయోగించినదని టాస్ వార్తాసంస్థ తెలియజేసింది.

వాతావరణం ఉపరితలం గురించి పరిశీలన జరిపే నిమిత్తం రష్యా ప్రయోగిస్తున్న ఉపగ్రహాల పరంపరలో ఇది పదవది.

కాస్మాస్-10 ప్రతి 90.2 నిమిషాలకు ఒకసారి భూమిచుట్టూ పరిభ్రమిస్తుంది.

క్రుశ్చెవ్ అమెరికా పర్యటన

వాషింగ్టన్, అక్టోబర్ 17—ఈ సంవత్సరం నవంబరు నెల ప్రాంతంలో అమెరికా పర్యటనకు రావడానికి రష్యాప్రధాని క్రుశ్చెవ్ నిర్ణయించుకున్నట్టు అభిజ్ఞ వర్గాలద్వారా నేడు తెలియవచ్చింది.

ఇండియా ఎగుమతుల పరిరక్షణకు కృషి

డిగోల్ హామీ నిచ్చినట్టు శ్రీ నెహ్రూ వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 17—

సమష్టి మార్కెట్‌లో బ్రిటన్ చేరికవల్ల కలిగే పరిణామాలదృష్ట్యా ఇండియా, పాకిస్తాన్, సింహళం దేశాల ఎగుమతుల పరిరక్షణకు యూరపియన్ ఆర్థికవ్యవస్థ తన శక్తికొద్ది యత్నించగలదని ఫ్రెంచి ప్రెసిడెంట్ జనరల్ డిగోల్ తనకు హామీ యిచ్చినట్టు ప్రధాని నెహ్రూ నేడు చెప్పారని తెలియవచ్చింది

నేడు జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ప్రసంగిస్తూ ప్రధాని నెహ్రూ ఈ విషయాన్ని వెల్లడించారట.

సమష్టి మార్కెట్‌లో చేరాలన్న బ్రిటన్ సంకల్పంపై ఇటీవల లండన్‌లో జరిగిన కామన్వెల్త్ ప్రధానుల సమావేశం తర్చల సారాంశాన్ని ఆయన కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీకి తెలియజేశారు.

యూరపియన్ సమష్టి మార్కెట్‌లో చేరాలన్న బ్రిటన్ సంకల్పానికిగల కారణాలను, ఇండియా పరిస్థితిని, యూరపియన్ ఆర్థిక వ్యవస్థలో ఇమిడివున్న రాజకీయ విషయాలను శ్రీ నెహ్రూ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీకి వివరించారట.

సెంట్రల్ బొంబాయి నగరంలోని లోయర్ పారెల్ వార్డునుంచి కార్పొరేషన్‌కు జరిగిన ఉపఎన్నికలో సంయుక్త మహారాష్ట్ర సమితి అభ్యర్థి తిరిగి ఎన్నికైనట్టు బొంబాయి నుంచి వార్త.

విదేశాలలోని రవాణా విమానాలు

కొనుగోలుకు ఇండియా సంకల్పం

("ఆంధ్రజ్యోతి" ప్రతినిధి)

న్యూఢిల్లీ, అక్టోబర్ 17— సరిహద్దుల రక్షణ విషయంలో భారత ప్రభుత్వం తీసుకొన్న నిర్ణయం రీత్యా మన సాయుధ దళాల స్థోమతను పెంచవలసివచ్చింది. అందువల్ల విదేశాలలోని రవాణా విమానాలను కొనుగోలుచేయాలని ప్రభుత్వం సంకల్పించినట్టు అధికారవర్గాలద్వారా తెలియవచ్చింది.

ఈ విషయమై పరిశీలన జరిపేందుకు ఎయిర్ వైస్ మార్షల్ హరీందర్‌సింగ్ బ్రిటన్, అమెరికా, కెనడాల పర్యటనకు వెళ్ళారు.

కెనెడియన్ రవాణా విమానాలను కొనుగోలు చేయాలని కూడా ఇండియా సంకల్పించినట్టు తెలుస్తున్నది.

సరిహద్దులలోని కొండ ప్రాంతాలకు సైనికులను, ఆహార పదార్థాలను సరఫరా చేయడానికి ఈ విమానాలను వినియోగించగలరని తెలియవచ్చింది.

"ప్రపంచ శాంతి పరిరక్షణ ఇండియా, రుమేనియాల లక్ష్యం"

యుద్ధం మానవజాతికి శత్రువని ఢిల్లీసభలో రాష్ట్రపతి రాధాకృష్ణన్, శ్రీ డెజ్‌ల స్పష్టీకరణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 17—

ప్రపంచంలో శాంతి పరిరక్షణే ఇండియా, రుమేనియాల లక్ష్యమని రాష్ట్రపతి రాధాకృష్ణన్, ప్రెసిడెంట్ జి. జి. డెజ్‌లు నేడిక్కడ ఉద్ఘాటించారు

యుద్ధాన్ని నివారించాలని కూడా తమ ఉభయ దేశాలు వాంఛిస్తున్నవని వారు పేర్కొన్నారు.

రుమేనియా ప్రెసిడెంట్ డెజ్ గౌరవార్థం ఏర్పాటు చేసిన విందులో రాష్ట్రపతి రాధాకృష్ణన్ ప్రసంగిస్తూ, యుద్ధం సమస్త మానవకోటికి శత్రువైనందువల్ల దానిని రూపుమాపాలని అన్నారు.

"ఇండియా, రుమేనియా దేశాలు ఎంతో దూరంలో వున్నాయి. ఉభయ దేశాల ప్రజలు విభిన్న భాషలను మాట్లాడుతారు. వివిధ సంప్రదాయాలను అనుసరిస్తారు. అయినా తన ప్రజల సంక్షేమం- యుద్ధ నివారణఅన్న ఆశయం ఉభయులలోనూ వున్నది" అని డాక్టర్ రాధాకృష్ణన్ అన్నారు.

ఆయన తన ప్రసంగాన్ని కొనసాగిస్తూ ఇంకా ఇలా చెప్పారు:

"ఉభయ దేశాల లక్ష్యాలు ఒకటే. అయితే వాటిని సాధించే పద్ధతులు వేరుగా వుంటాయి. కాని మన ఈ ఆశయాలు, ఆశలు అన్నిటిని కొంతమంది సైనిక శక్తిద్వారా నష్టం చేయగలరు. అంతరంగిక, అంతర్జాతీయ రంగాలలో మన ఉభయ దేశాలకు ఒకే లక్ష్యాలు వున్నవి.

"యూరప్‌లో పెట్రోల్ పరిశ్రమను అభివృద్ధి చేసిన వారిలో ప్రథములు మీరు. గౌహతిలో పెట్రోల్ శుద్ధి కర్మాగారం స్థాపనంలో మేము మీసహాయాన్ని సహకారాన్ని పొందాము. మన ఉభయ దేశాలమధ్య స్నేహ సంబంధాలు పెంపొందగలవని ఆశిస్తున్నాను"

రుమేనియా ప్రెసిడెంట్ డెజ్ మాట్లాడుతూ, భారతీయులవలె రుమేనియన్లుకూడా శాంతిప్రియులని అన్నారు.

భారతదేశంలో తాము ఎక్కడికి వెళ్ళినా సుహృద్భావంతో తమకు స్వాగతం లభించినదని, ఉభయ దేశాల మధ్య సంబంధాలను అభివృద్ధిచేసుకొనడానికి చాలా అవకాశాలు వున్నవని ఆయన అన్నారు.

భారతీయులవలె రుమేనియన్ ప్రజలు కూడా తమ దేశ ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి కృషి చేస్తున్నారని ఆయన చెప్పారు.

శ్రీ బొజ్జా ఆదినారాయణకు సన్మానం ఏర్పాట్లు

హైదరాబాద్, అక్టోబర్ 18—శాసన మండలి సభ్యులు శ్రీ బొజ్జా ఆదినారాయణగారికి సన్మానం చేయడానికి పల్నాటిసీమ కార్యకర్తలు సమావేశమై ఆహ్వాన సంఘాన్ని ఏర్పాటు చేసినట్టు శ్రీ కర్నూలపు కోటయ్య ఒక ప్రకటన చేస్తున్నారు.

సన్మానం డిసెంబర్‌లో మూడవ వారంలో జరపడానికి సన్నాహాలు జరుగుతున్నవని, సన్మాన సభ అధ్యక్షులుగా ఆర్థికమంత్రి శ్రీ కాసు బ్రహ్మానంద రెడ్డిగారిని, సభా ప్రారంభకులుగా ముఖ్యమంత్రి శ్రీ నీలం సంజీవరెడ్డిగారిని కోరినట్టు కూడా ఆయన తెలియజేస్తున్నారు.

మహారాష్ట్ర గవర్నర్ డాక్టర్ పి సుబ్బరాయన్ వ్యక్తికి కోయంబత్తూరులోని భారతీయ వాణిజ్య మండలి వారు తమ సంతాపం ప్రకటిస్తూ తీర్మానించారు.

హైదరాబాద్ ఆయుర్వేద కళాశాల

నిరాహారదీక్ష పూనిన విద్యార్థులకు ఆసుపత్రిలో చికిత్స

హైదరాబాద్, అక్టోబర్ 17—ప్రభుత్వ ఆయుర్వేద కళాశాలలో నిరవధిక నిరాహారదీక్షపూని బాగా బలహీనపడిన ఆయిదుగురు విద్యార్థులను పోలీసులు నిన్న రాత్రి ఉస్మానియా జనరల్ ఆసుపత్రిలో చేర్చారు.

విద్యార్థులు నేటి ఉదయం పాలు అతర్వాత కాఫీ తీసుకొన్నారని ఆసుపత్రి అధికారులు తెలియజేశారు. అంతే వీటిని బలవంతంగా త్రాగించారని విద్యార్థుల ప్రతినిధి ఒకరు అన్నారు.

తమ కళాశాలను ఉస్మానియా యూనివర్సిటికి అనుబంధింపజాలని, లేనిపక్షంలో జి. సి. ఐ. ఎం. డిగ్రీని తమకు ఇవ్వాలని విద్యార్థులు కోరుతున్నారు.

భారతీయ వైద్యశాఖ ప్రత్యేకాధికారి శ్రీ రాయ్ రామచంద్ర అస్తాన్ పి. టి. ఐ. విలేకరితో మాట్లాడుతూ కళాశాలలోని మొత్తం 80 మంది విద్యార్థులలో 67 మంది ఇంకా తరగతులకు హాజరు కావడంలేదని వారి వార్షికపరీక్షలు రేపు ఉదయంనుంచి ప్రారంభ మవుతున్నాయని చెప్పారు.

ఈ పరీక్షలను బహిష్కరించి, ఉద్యమాన్ని కొనసాగించడానికితాము నిశ్చయించుకొన్నామని విద్యార్థులు అంటున్నారు.

నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల తల్లిదండ్రులకు ఉచిత వైద్య సౌకర్యం

హైదరాబాద్, అక్టోబర్ 18 — నాన్‌గెజిటెడ్ ఉద్యోగుల కుటుంబాలకు ప్రస్తుతం లభ్యమవుతున్న ఉచిత వైద్యసౌకర్యాలను ఆ ఉద్యోగి తల్లిదండ్రులకు (వారు ఆశ్రితులై పూర్తిగా ఆధార పడిన పక్షాలైతే) కూడా వర్తింప చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది.

ఉపరాష్ట్రపతితో దలైలామా భేటి

న్యూఢిల్లీ, అక్టోబర్ 18—దలైలామా నిన్న ఉపరాష్ట్రపతి డాక్టర్ జాకీర్ హుస్సేన్‌ను కలుసుకున్నారు. వారిద్దరు సుమారు సలభై నిమిషాలపాటు కలసివున్నారు.

నిన్న దలైలామా బసచేస్తున్న హైదరాబాద్‌భవనానికి పెక్కుమంది టిబెటన్‌లు వెళ్ళి ఆయనను కలుసుకున్నారు.

ప్రాన్సులోని బాలుర వసతి గృహంలో నివసించే నిమిత్తం రేపు బయలుదేరివెళ్ళనున్న టిబెటన్ బాలురు కూడా వీరిలో వున్నారు.

దలైలామా రాజఘాట్‌కు వెళ్ళి గాంధీజీ సమాధిపై పుష్పగుచ్ఛాన్ని వుంచడంతో తన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

విజయవాడలో కలరా నిరోధానికి చర్యలు

పాతబస్తీలో 15 రోజులపాటు స్కూల్సు మూసివేతకు ఆరోగ్య శాఖాధికారి ఉత్తర్వు

పరిసర ప్రాంతాలనుంచి పాలు సరఫరా అయ్యే హోటల్స్‌లో కాఫీ, టీల విక్రయం నిలుపుదలకు ఏర్పాట్లు

విజయవాడ, అక్టోబర్ 17—

విజయవాడ పాత బస్తీలోని ప్రయివేటు పాఠశాలలను, మునిసిపల్ పాఠశాలలను 15 రోజులపాటు మూసివేయాలని మునిసిపల్ ఆరోగ్య శాఖాధికారి నేడు ఉత్తరువు చేశారు.

ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. ఎల్. సాగర్ ఈ విషయాన్ని తెలియజేస్తూ ముందు జాగ్రత్త నిమిత్తం తల్లిదండ్రులు తమ పిల్లలను ఇండ్లలోనే వుంచుకొనాలని సలహా ఇచ్చారు.

వ్యాధి వ్యాప్తికి తోడ్పడే చేపలు, మాంసం మొదలైన ఆహార పదార్థాల విక్రయాన్ని నిరోధించడానికికూడా ప్రజారోగ్య చట్టం కింద తీవ్రమైన చర్యలు తీసుకొనబడుతున్నవని ఆయన అన్నారు.

విజయవాడ పరిసర గ్రామాలలోనే మొట్టమొదటగా కలరా వ్యాపించినట్టు కన్పిస్తున్నందువల్ల ఆ గ్రామాల నుంచి పాలను సరఫరా చేసుకొనే హోటళ్ళలో కాఫీ, టీ, పాలు విక్రయాన్ని నిలిపివేయడానికి తాము సత్వర చర్యలనుతీసుకొంటున్నామని శ్రీ సాగర్ తెలియజేశారు.

నేటి మధ్యాహ్నం మూడుగంటలవరకు కొత్తగా ముగ్గురు కలరా వ్యాధిగ్రస్తులను ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్చారు. నిన్న అర్ధరాత్రినుంచి నేటి మధ్యాహ్నం వరకు ఒక వ్యక్తిమాత్రం చనిపోయాడు.

నేటి మధ్యాహ్నం వరకు కలరా వ్యాధి సోకి ఆసుపత్రిలో చేర్చబడిన వారి సంఖ్య 167 కు, మృతి చెందినవారి సంఖ్య 40 కు పెరిగింది.

చైనా బెదిరింపు

భారతీయ విమానాలు తమ గగనపరిధిని అతిక్రమిస్తే కూల్చివేస్తారట

పెకింగ్, అక్టోబర్ 18—

భారతీయ విమానాలు ఏవైనా తమ గగన పరిధిని అతిక్రమిస్తే వెంటనే వాటిని కూల్చివేయడంగాని, లేదా బలవంతంగా దింపివేయడంగాని జరుపగలమని చైనా నేడు ఇండియాకు తెలియజేసింది

చైనా ప్రభుత్వం ఇండియాకు ఒక లేఖ పంపుతూ ఢిల్లీకూడా ఇదేవిధంగా చేసే అర్హత కలిగివున్నట్టు పేర్కొన్నది.

ఈ లేఖ నేటి రాత్రి పత్రికా ప్రతినిధులకు అందజేయబడింది.

ఇండియాకూడా చైనా విమానాల విషయంలో ఇదే పద్ధతిని అనుసరించవచ్చునని తాను తెలపడాన్నిబట్టి చైనా విమానాలు ఎన్నడూ భారత గగన పరిధిని అతిక్రమించలేదని, ఇండియా నిరంతరాయంగా తన విమానాలను చైనా గగనపరిధి అతిక్రమణకు పంపుతున్నదని తెలుస్తున్నట్టు ఇది తెలిపింది.

గత మంగళవారంనాడు భారతీయ విమానం టిబెట్ రాజధాని లాసాపై ఎగిరినట్టు చైనాచేసిన ఆరోపణను తిరస్కరిస్తూ అక్టోబర్ 13 వ తేదీన ఇండియా పంపిన లేఖకు సమాధానంగా చైనా ఈ లేఖ పంపింది.

చైనా ఈ లేఖతోపాటుగానే మరొక లేఖను కూడా విడుదల చేసింది.

చైనా గగన పరిధిని అతిక్రమించడానికి, చైనా-భారత సరిహద్దులో ఉద్రిక్తతను ఉద్దేశపూర్వకంగా రెచ్చగొట్టడానికి ఇండియా తన విమానాలను తరచుగా పంపుతున్నదని పెకింగ్ ఈ లేఖలో ఆరోపిస్తూ, ఇందుకు "తీవ్ర నిరసన"ను వ్యక్తం చేసింది

ఆగస్టు, సెప్టెంబర్ నెలలలో భారత విమానాలు 20 సార్లకుపైగా చైనా గగన పరిధిని అతిక్రమించినవనిచూపే అనుబంధ పట్టికను పెకింగ్ ఈ లేఖతోపాటు జత పరచింది.

చైనా సైనికులపై భారత దళాలు కాల్పులుజరిపినవట

నవ చైనా వార్తాసంస్థ ప్రకటన

హాంగ్‌కాంగ్, అక్టోబర్ 17— ఈశాన్య సరిహద్దులోని చెడాంగ్ సమీపంలో వున్న వివాదాస్పద ప్రాంతంలో భారతీయ దళాలు చైనా భూభాగంపై దాడి జరిపి చైనీస్ సరిహద్దు సైనికులపై కాల్పులు జరిపినవని నవ చైనా వార్తా సంస్థ నేడు ప్రకటించింది

నిన్న జరిగిన ఈ సంఘటనలో చైనీయులు ఎదురు కాల్పులు జరపలేదని ఆ వార్తా సంస్థ పేర్కొన్నది.

పత్రికా సలహాసంఘం ఏర్పాటు

సభ్యత్వానికి వర్కింగ్ జర్నలిస్టుల కార్యవర్గం నిరాకరణ

హైదరాబాద్, అక్టోబర్ 17— పత్రికా సలహా సంఘం పద్ధతిని తిరిగి పునరుద్ధరించడం ద్వారా కేంద్ర ప్రభుత్వం ప్రెస్ కమిషన్ రూపొందించిన సూత్రాలను ఉల్లంఘించినదని భారత వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య కార్యవర్గం నిన్న ఇక్కడ విమర్శించినది.

ప్రస్తుత పత్రికా సలహా సంఘాన్ని రద్దుచేసి, దాని స్థానే ప్రెస్‌కమిషన్ సిఫారసు ప్రకారం పత్రికా సమితిని ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించినది.

భారత వర్కింగ్ జర్నలిస్టుల సమాఖ్య అధ్యక్షునికి సలహా సంఘంలో పనిచేయవలసినదిగా మంత్రిత్వ శాఖ నుంచి అందిన ఆహ్వానాన్ని అంగీకరించరాదని కూడా సమాఖ్య కార్యవర్గం ఆమోదించిన తీర్మానంలో పేర్కొన్నారు.

పారిశ్రామికులచే విద్యుచ్ఛక్తి ఉత్పత్తి

ఆంధ్ర ప్రభుత్వం అనుమతించ గలదని మంత్రి శ్రీ లక్ష్మీనరసయ్య వివరణ

మద్రాసు, అక్టోబర్ 17—

ఆంధ్రప్రదేశ్‌లోని పారిశ్రామికవేత్త లెవరైనా తమ అవసరం నిమిత్తం విద్యుచ్ఛక్తిని ఉత్పత్తి చేసుకొనదలిస్తే కేంద్రం ఎటువంటి అభిప్రాయాన్ని వెలిబుచ్చినా, రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అందుకు అనుమతించగలదని పరిశ్రమల మంత్రి డాక్టర్ ఎం. ఎస్. లక్ష్మీనరసయ్య నేడిక్కడ చెప్పారు

ఈ విషయంలో అవసరమైతే తాము కేంద్రంపై ఒత్తిడి తేగలమనికూడా శ్రీ లక్ష్మీనరసయ్య అన్నారు.

ఆంధ్ర వాణిజ్య మండలి సమావేశంలో ఆయన ప్రసంగిస్తూ విద్యుచ్ఛక్తి కొరతవల్ల ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలకు విఘాతమేర్పడడానికి అనుమతించబోమన్నారు.

ఇటీవల రాష్ట్రంలో విద్యుచ్ఛక్తి కొరత ఏర్పడినపుడుకూడా పరిశ్రమలు వాటికి కావలసిన విద్యుచ్ఛక్తిని ఉపయోగించుకొనడానికి ప్రభుత్వం అంగీకరించిన దన్నారు.

రానున్న రెండు, మూడు సంవత్సరాలలో ఆంధ్రప్రదేశ్‌లో విద్యుచ్ఛక్తి పరిస్థితిమెరుగు కాగలదని భావిస్తున్నట్టు ఆయన తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌కు సాధ్యమైనంత త్వరలో పారిశ్రామికంగా అభివృద్ధి పరచవలెనని రాష్ట్ర ప్రభుత్వం యత్నిస్తున్నట్టు మంత్రి శ్రీ లక్ష్మీనరసయ్య చివరిగా, రాష్ట్ర ప్రణాళికలో పరిశ్రమలకు జరిపిన కేటాయింపును పెంచాలని తాము ప్లానింగ్ కమిషన్‌ను ఒత్తిడిచేస్తున్నామన్నారు.

దేశంలో ఏ ప్రాంతానికి చెందినవారైనా ఆంధ్రప్రదేశ్‌కువచ్చి కొత్త పరిశ్రమలను నెలకొల్పవచ్చునని, వారికి అన్ని సదుపాయాలు సమకూర్చగలమని మంత్రి తెలిపారు

ప్రభుత్వ రంగంలో నెలకొల్పబడిన సింథటిక్ ఔషధాల ఫ్యాక్టరీ, భారీ విద్యుత్ పరికరాల కర్మాగారం అవసరాల నిమిత్తం పెక్కు అనుబంధ పరిశ్రమలను నెలకొల్పవలసివుందని ఆయన చెప్పారు.

కృతియ ప్రణాళిక ముగిసేనాటికి రాష్ట్రంలో 18 గ్రామీణ పారిశ్రామికవాడలు ఏర్పాటు కాగలవని శ్రీ లక్ష్మీనరసయ్య వెల్లడించారు.

రాష్ట్ర అమ్మకం పన్ను చట్టం సవరణ సందర్భంలో వ్యాపారస్తుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొనడం జరుగుతుందని ఆయన చెప్పారు.

పెత్తందారు "తోడుదొంగలు"

వర్షాభావం వల్ల హిందూపురంరైతుల ఇక్కట్లు

ప్రభుత్వానికి పట్టణ కాంగ్రెస్ కమిటీ విజ్ఞప్తి

హిందూపురం, అక్టోబర్ 18— హిందూపురం పట్టణ కాంగ్రెసు కార్యవర్గ సమావేశం శ్రీ కిల్లూరు సుబ్బరావుగారి గృహంలో ఇటీవల జరిగింది. శ్రీ మల్లిపూడి పల్లంరాజు, డాక్టర్ పి. సుబ్బరాయన్‌గార్ల మరణానికి సంతాపం తెలుపుతూ సభలో తీర్మానించారు.

వర్షాభావ పరిస్థితిని గురించి ఈ సభలో చర్చించి, ఈ మధ్య మైసూరు రాష్ట్రసరిహద్దులలో కురిసిన వర్షాల ఫలితంగా ఈ తాలూకాలోని కొన్ని చెరువులు మాత్రం నిండినవని మొత్తంపై తాలూకాలోని పెక్కు చెరువులలో నీరు లేక ఈ సంవత్సరం కూడా రైతులు చెరువుల క్రింద వంటలు వండివేసుకోలేని పరిస్థితి ఏర్పడినందున ప్రభుత్వంవారు వాస్తవ పరిస్థితిని గుర్తించి ఈ తాలూకా రైతులకు అన్నివిధాల సహాయ పడవలెనని మరొక తీర్మానంలో అర్థించారు.

ఆంధ్ర ప్రదేశ్‌లో మారు మూలలో నున్న హిందూపురం ప్రాంత ప్రజలకు ఉన్నత విద్యాభ్యాసమునకుగాని, సాంకేతిక విద్యకుగాని ఎటువంటి సదుపాయములు అందుబాటులో లేనందున ఈ లోటు మన తీర్చుటకై, ఇప్పుడు ప్రభుత్వం రాయలసీమ ప్రాంతంలో నెలగొల్పదలచిన త్రిపాలిటెక్నిక్ శిక్షణ కేంద్రమును హిందూపురంలో స్థాపించవలసినదిగా కోరుతూ మరొక తీర్మానం ఆమోదించారు.

పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ డి. సూర్యనారాయణయ్య అధ్యక్షత వహించిన ఈసభకు పట్టణకాంగ్రెస్ కార్యదర్శులు శ్రీ ఎం. పుట్టప్ప, శ్రీ సి. ఎ. అనంత నారాయణ పత్యులు శ్రీమతి హెచ్. గోదావరిబాయి తమని అన్నపూర్ణమ్మ, శ్రీయుతులు జి. ఎస్. సూర్యనారాయణ, ఎస్. వెంకటరావు, ఎం. జి. బాబు, హెచ్. సంజీవప్ప హాజరయ్యారు.

రహదారుల అభివృద్ధి

మంత్రికి ఆంధ్రప్రదేశ్ మోటార్ యూనియన్స్ కాంగ్రెస్ విజ్ఞప్తి

విజయవాడ, అక్టోబర్ 18— మూడవ ప్రణాళికలో రాష్ట్ర రహదారుల అభివృద్ధికి కేటాయించిన నిధులు సరిపడవని, రవాణా కార్యాలను మెరుగు పరచడానికి యింకా నిధులను కేటాయించాలని— ఆంధ్రప్రదేశ్ మోటారు యూనియన్స్ కాంగ్రెస్ కార్యదర్శి శ్రీ రామబ్రహ్మం ఈ నెల 11 వ తేదీన రాష్ట్ర రవాణా శాఖ మంత్రి శ్రీ బి. వి. గురుమూర్తికి సమర్పించిన మెమొరాండంలో పేర్కొన్నారు.

తెలంగాణా ప్రాంతంలో రోడ్డు రవాణా కార్పొరేషన్ బస్సులను మరింతగా పెంచాలని ప్రతి జిల్లాలోను కనీసం పంద బస్సులనైనా నడపాలని ఆ మెమొరాండంలో అభ్యర్థించారు.

రోడ్డు రవాణా కార్పొరేషన్ కొత్త జిల్లాలకు సర్వీసులను విస్తరింప చేయడానికి బదులు ప్రస్తుత సర్వీసులను మరింత సమర్థవంతంగా నిర్వహించడానికి పూనుకోవాలని కూడా ఆ మెమొరాండంలో విన్నవించారు.

దేశంలోని బొగ్గు కొరత దృష్ట్యా బొగ్గు రవాణాను లారీలకు అప్పగించాలని, గనుల వద్ద నుంచి రెండు వందల మైళ్ళ వరకు కూడా లారీలపైనే బొగ్గు రవాణా అయ్యేటట్టుగా ఏర్పాట్లు చేయాలనికూడా ఆ మెమొరాండంలో అర్థించారు.

రవాణా పరిశ్రమపై మరింత పన్నుల భారాన్ని మోపాలని ప్రభుత్వం యోచిస్తున్నట్టుగా తెలుస్తున్నది. అయితే ఇందు మూలంగా పరిశ్రమ దాల చిక్కులను ఎదుర్కొనవలసి వస్తుందని ఆ మెమొరాండంలో వివరించారు.

మంత్రి శ్రీ గురుమూర్తి పై అంశాలను సానుభూతితో పరిశీలించగలనని హామీ యిచ్చినట్టుగా తెలుస్తున్నది.

నిడదవోలు కో-ఆపరేటివ్ యూనియన్ ఎన్నికలు

నిడదవోలు, అక్టోబర్ 18— నిడదవోలు కోఆపరేటివ్ యూనియన్ ఎన్నికలు శ్రీమానాప్రగడ నరసింహంగారి అధ్యక్షతన ఈ నెల 15 వ తేదీన జరిగాయి. ఈ సందర్భంలో శ్రీ జువ్వాది లక్ష్మయ్య నాయుడుగారి చిత్రపటాన్ని కార్యాలయంలో ఆవిష్కరించారు.

ఈ క్రింద వారు కార్యవర్గంగా ఎన్నికయ్యారు: అధ్యక్షుడు: శ్రీ మానాప్రగడ నరసింహం. కార్యదర్శి శ్రీ పి. వి. బి. ప్రసాదరాజు, డైరెక్టర్లు: శ్రీ సత్తిరాజు సాంబశివరావు, శ్రీ పుంటంపల్లి ఆమ్మిరాజు, శ్రీ గండం వెంకటరత్నం. తేనీటివిందు అనంతరం కార్యక్రమం ముగిసింది.

కొప్పర్రు సేవా సకలార్థ సహకార సంఘం

నర్సాపురం, అక్టోబర్ 18 — నరసాపురం తాలూకా కొప్పర్రు సేవాసకలార్థ సహకార సంఘం అధ్యక్షుడు శ్రీ పోలిశెట్టి శేషావతారం అధ్యక్షతను సమావేశమైనది

నూతనపాలకవర్గసభ్యులుగా శ్రీయుతులు పోలిశెట్టిశేషావతారంకారిదర్శి అప్పినారాయణ, పోలిశెట్టి వెంకటసుబ్బయ్య, కుంకటి అప్పారావు, గోగులమంద కన్నందాసు, కడలి సుబ్బరావు, జెడ్ చినపల్లయ్య గారలను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

మల్లిపూడి పల్లంరాజు మృతికి యీ సభవారు చింతిస్తూ హరిఆత్మ శాంతికి కొన్ని నిమిషాలు మౌనంవహించి భగవంతుని ప్రార్థించారు.

కృష్ణాజిల్లా పెదమద్దాలిలో పంచాయతీ కార్యాలయం, టెలిఫోన్ రూములకు జిల్లాపరిషత్తు అధ్యక్షుడు శ్రీ మాగంటి అ. కిసీడు ప్రారంభోత్సవం చేసినప్పటి ఫొటో. ఆయనకు కుడిప్రక్క పంచాయతీ అధ్యక్షులు శ్రీ మిక్కిలినేని భాస్కరరావు వున్నారు

గుంటూరులో హరిప్రసాదరాయ వర్ధంత్యుత్సవం

గుంటూరు, అక్టోబర్ 18— ఈ నెల 7 వ తేదీన 'ఆంధ్ర నట పితామహ' హరిప్రసాదరాయ 26 వ వర్ధంతి శ్రీ ఏకాదండయ్య వంతులు హాలులో ప్రముఖ రంగస్థల నటులు శ్రీ జగర్లపూడి లక్ష్మీనరసింహారావుగారి అధ్యక్షతన అత్యంత వైభవోపేతంగా జరిగింది. అనేక మంది పురప్రముఖులు, కళాకారులు సభకు హాజరయ్యారు. సభా కార్యక్రమము సుప్రసిద్ధ నాదస్వర విద్వాంసులు శ్రీ యనమదల వెంకటస్వామి బృందంవారి నాదస్వర కచేరితో ప్రారంభింపబడింది.

కార్యదర్శి శ్రీ మందపాటి రామలింగేశ్వరరావు సదస్సులకు స్వాగతం చెబుతూ నటపితామహునకు తమ కార్యవర్గం తరపున భక్తాంజలి సమర్పించారు. శ్రీ ప్రభాకర శాస్త్రి వేద ప్రవచనం చేశారు. సభాధ్యక్షులు శ్రీ నరసింహారావు ప్రసంగిస్తూ, స్వర్గీయ హరిప్రసాదరావుగారు నటపితామహుడేకాక నటయుగకర్తయని, ఆయన పేరట గుంటూరులో శ్రీ ఆంధ్ర విజ్ఞాన లలిత కళా పరిషత్ వారు ఒక నాట్య శిక్షణ కళాకేంద్రాన్ని స్థాపించి, దాని నిర్మాణం కోసం పూనుకోవడమే కాకుండా ప్రతియేటా వారి వర్ధంతి సందర్భమున ఒక కళాకారునకు సూటపడ్డ హార్దు యిచ్చి సత్కరించడం యెంతో గర్హించదగ్గ విషయమని ప్రశంసించారు.

తరువాత హిందూ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ వల్లభశాస్త్రుల సుబ్బారావు మాట్లాడుతూ స్వర్గీయ ప్రసాదరావుగారు రంగస్థలం మీద మహారాజుగా వెలుగొంది యెనలేని కీర్తిగాంచి నిత్యజీవితంలో తన చివరి కాలంలో ఎంతో కష్టభూయిష్ఠమైన జీవితాన్ని గడిపారన్నారు.

శ్రీ నడింపల్లి వేంకట లక్ష్మీనరసింహారావు, శ్రీ బండారు రామస్వామినాయుడు శ్రీ విజయమూరి శ్రీనివాసాచారి కూడా నటపితామహుని ప్రశంసిస్తూ ప్రసంగించారు.

తరువాత పట్టణంలోని పలు సమాజాల వారు, ప్రముఖ కళాకారులు నటపితామహుని చిత్ర పటమునకు శ్రద్ధాంజలి సమర్పిస్తూ పుష్పమాలలు సమర్పించారు.

అనంతరం సుప్రసిద్ధ కవులు శ్రీ మంచికంటి వేంకటేశ్వరరావుగారికి కవి సత్కారం జరిగింది. పరిషత్ అధ్యక్షులు శ్రీ జూంపూడి యజ్ఞనారాయణ కవిగారిని పుష్పమాలాలంకృతులను చేసి దుశ్శాలువ, మాటపదహార్లు యిచ్చి సత్కరించారు. శ్రీ బండారు రామస్వామిగారు సన్మాన పత్రం సమర్పించారు.

శ్రీ కొల్లా కృష్ణారావు, శ్రీ పి. హనుమయ్య గారలు శ్రీ వెంకటేశ్వరరావు రచనల గూర్చి ప్రసంగించారు. రాత్రి నాట్యకళ సంపాదకులు శ్రీ శ్రీనివాస చక్రవర్తి బందరులోని "ఇండియన్ డ్రమిటిక్ కంపెనీ" వారు ప్రదర్శించిన "చిత్రసరోజము" నాటకమునకు ప్రారంభోత్సవం చేశారు కార్యదర్శి వందన సమర్పణతో కార్యక్రమము జయప్రదంగా ముగిసింది.

దసరా పండుగకు కార్మికులకు బోనస్

రాయలసీమ ప్యాసింజర్, గూడ్సు ట్రాన్స్‌పోర్ట్సువారిచే

హిందూపురం, అక్టోబరు 18— స్థానిక రాయలసీమ ప్యాసింజర్, గూడ్సు ట్రాన్స్‌పోర్ట్సు మేనేజింగ్ డైరెక్టర్లు శ్రీయుతులు దాలికృష్ణన్, ఎల్. జి. రామమూర్తి, ఎల్. జి. వరదరాజులు, ఎల్. జి. నిత్యానందంగారలు తమ రవాణా సంస్థలో పని చేస్తున్న కార్మికులకు దసరా పండుగ సందర్భంలో నాలుగు నెలలు జీతాన్ని బోనసుగా యిచ్చారు.

ఇందుకు రవాణా సంస్థ కార్మికులు డైరెక్టర్లకృతజ్ఞత తెలియజేస్తూ తమహర్ష ప్రకటన చేశారు.

కర్నూలుజిల్లా కాంగ్రెసులో ప్రాథమిక సభ్యత్వం

28 వేల దరఖాస్తుల నిరాకరణకు తీర్మానం

("ఆంధ్రజ్యోతి" విలేకరి) కర్నూలు, అక్టోబర్ 18—

కర్నూలు జిల్లా కాంగ్రెసు కార్యవర్గం నిన్న ఇక్కడ సమావేశమై కాంగ్రెసులో ప్రాథమిక సభ్యత్వాన్ని కోరుతూ వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మీదట, వానిలో సుమారు 28 వేల దరఖాస్తులను నిరాకరించడానికి నిర్ణయిస్తూ తీర్మానించింది.

ఈ సమావేశం ఇక్కడి కళావెంకటరావు భవన్‌లో జరిగింది. సమావేశానికి జిల్లా కాంగ్రెసు అధ్యక్షులు శ్రీనివర్తి వెంకటసుబ్బయ్య (ఎమ్. ఎల్. సి.) అధ్యక్షత వహించారు.

కాంగ్రెసులో ప్రాథమిక సభ్యత్వాన్ని కోరుతూ వచ్చిన దరఖాస్తులు చేరవలసిన తేదీకి రెండునెలలు ఆలస్యంగా చేరినవని, వాటిని పరిశీలించిన మీదట నిరాకరించడానికి నిర్ణయిస్తూ తీర్మానించారు.

ఈ సభ్యుల జాబితాలను ప్రదేశ్ కాంగ్రెసు అంగీకరించడం, గత జూన్ 28 వ తేదీన ఏ.ఐ.సి.సి. వంపిన సర్క్యులర్‌లోని ఆదేశాలకు విరుద్ధమని తీర్మానంలో తెలియజేశారు.

సభ్యులను చేర్చుకొనడంలో జిల్లా కాంగ్రెసులకే ప్రధానమైన బాధ్యత గలదని, ప్రదేశ్ కాంగ్రెసు వ్యక్తులకు గాని, లేదా కమిటీలకుగాని నేడు విడుదలచేసే సభ్యత్వం పుస్తకాలను తిరిగి ఆయా జిల్లా కాంగ్రెసులకే పంపాలని, ప్రదేశ్ కాంగ్రెసు సేకరించిన విరాళాలనుకూడ వెంటనే జిల్లాకాంగ్రెసులకు పంపాలని ఏ. ఐ. సి. సి. సర్క్యులర్‌లో ఆదేశింపబడినదని తెలిపారు.

జిల్లా కాంగ్రెసుకు (కర్నూలు) చేరిన సభ్యత్వం జాబితాలను పరిశీలించినమీదట వానిలో బాగా వరకు దొంగ సభ్యత్వాలున్నవని భావించామని, వానిని అంగీకరించిన పక్షంలో తీవ్రమైన క్రమశిక్షణా రాహిత్యం ప్రబలిపోయి, అవాంఛనీయమైన పద్ధతులను ప్రోత్సహించడం కాగలదని, తద్వారా కాంగ్రెసు సంస్థ విచ్ఛిన్నం కాగలదని భావించి, సుమారు 28 వేల దరఖాస్తులను నిరాకరించాలని తీర్మానించాం.

ఈ తీర్మానాన్ని సమావేశంలో ఓటింగుకు పెట్టినప్పుడు, 14 మంది అనుకూలంగాను, ప్రధాన కార్యదర్శి శ్రీ ఎస్. రఘురామరెడ్డి వ్యతిరేకంగాను ఓటు చేశారు.

తొలుత, శ్రీయుతులు ఎమ్. వళ్ళంరాజు, డాక్టర్ సుబ్బరాయన్‌గార్ల మృతికి తమ సంతాపం తెలుపుతూ తీర్మానించారు. అనంతరం సమావేశాన్ని 20 వ తేదీకి వాయిదా వేశారు.

20 వ తేదీన జరిపే సమావేశంలో జిల్లా రిటర్నింగ్ ఆఫీసరు ఎన్నిక జరుగుతుంది.

సమావేశానికి హాజరయినవారిలో శ్రీయుతులు పెండికంటి వెంకటసుబ్బయ్య(ఎం.పి) కె.వి. నరసప్ప (ఎమ్.ఎల్.ఎ.). డి. పాండురంగారెడ్డి (ఎమ్. ఎల్. సి.). టి. జి తిమ్మయ్యశెట్టి (మాజీ శాసనసభ్యుడు). జి. రామిరెడ్డి (మార్కాపురం పంచాయతీ సమితి అధ్యక్షుడు). హెచ్. వెంకటేశ్వరరావు, యు. గిద్దయ్య ప్రభృతులు వున్నారు.

రాజమండ్రిలో మహిళా జనసంఘ సమ్మేళనం

డిశంబర్‌లో జరపాలని నిర్ణయం

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

రాజమండ్రి అక్టోబర్ 18— మహిళా జనసంఘం సమ్మేళనం వచ్చే డిశంబర్‌లో ఇక్కడ జరపాలని స్థానిక నియోజక వర్గ జనసంఘం కమిటీ డాక్టర్ యం. మల్లిభాట్లరావు అధ్యక్షతన ఇటీవల సమావేశమయి నిర్ణయించింది.

జిల్లా కార్యదర్శి శ్రీ వి. యల్. యస్ వెంకటరామయ్య ప్రత్యేక ఆహ్వానం మీద ఆ సమావేశంలో పాల్గొన్నారు.

కుట్టుపనిలో యోగ్యతా పత్రాలు

జిల్లా కలెక్టర్ చే నూజివీడులో ప్రదానం

నూజివీడు, అక్టోబర్ 18— కృష్ణాజిల్లా కలెక్టర్ శ్రీ ఎస్. ఎ. కరీం కుట్టుమిషనులపై శిక్షణ పొందిన మహిళలకు నూజివీడులో 12 వ తేదీన యోగ్యతా పత్రాలు బహూకరించారు. ఈ సందర్భంలో జరిగిన బహిరంగ సభకు శ్రీ దన్నపనేని రంగారావు (సమితి అధ్యక్షులు) అధ్యక్షత వహించారు.

బ్లాకు డెవలప్‌మెంటు ఆఫీసరు శ్రీ జి. సి హెచ్. రాధాకృష్ణ సమితిలో మహిళా సమాజాల కార్యకలాపాలను వివరిస్తూ, సమాజాభివృద్ధికి మంత్రి శ్రీ ఎం. ఆర్. అప్పారావు చేసిన కృషిని వివరించారు. శ్రీ దన్నపనేని రంగారావు తమ ప్రసంగంలో మహిళా సమాజ సభ్యుల బాధ్యతలను వివరించారు.

కలెక్టర్ శ్రీ కరీం నూజివీడు మహిళా సమాజ కార్యక్రమాలు, వారి పురోభివృద్ధిని ప్రశంసించారు. మహిళలు స్వయంకృషితో ఒక ప్రత్యేక భవన నిర్మాణానికి పూనుకొనాలని ఆయన ఉద్బోధించారు.

వినోద కార్యక్రమాల అనంతరం శ్రీ డి. వి. వి. శ్రీ జి. సి హెచ్ రాధాకృష్ణ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

విజయవాడలో దేవీ నవరాత్రోత్సవాలు

విజయవాడ అక్టోబర్ 18—విజయవాడ సత్యనారాయణపురం దేవస్థానంలో శ్రీ అన్నపూర్ణ దేవీనవరాత్రిమహోత్సవాలు శ్రీ నంబూరి పూర్ణచంద్రరావు కన్వీనరుగా ఏర్పడిన దేవస్థాన పుత్సవాల నిర్వహణ సంఘంవారి ఆధ్వర్యాన వైభవంగా జరుపబడినవి.

బ్రహ్మశ్రీ కలగా ఆంజనేయశాస్త్రి దేవీ భాగవత ఉపన్యాసాలు పురాణ ప్రవచనాలకు ప్రారంభోత్సవం చేశారు. బ్రహ్మశ్రీ గొళ్ళపల్లి బుచ్చిరామశాస్త్రి నిత్యం ఆకార్యక్రమం కొనసాగించారు.

విజయదశమినాడు పాడువేట ఉత్సవం, శమీ పూజలను శ్రీ నీతరాజు అన్నపూర్ణ విశ్వేశ్వర శర్మ దంపతులు నిర్వహించారు. రాత్రి 10 గంటలకు శ్రీ మారుతీ నాటక సమాజం వారిచే "రామాంజనేయ యుద్ధం" ప్రత్యేక రంగస్థల నటులు, పి. సూర్యాబాబు అధ్యక్షతన ప్రదర్శింపబడినది. శ్రీ శిరిపురపు కోటేశ్వరరావు స్వాగతం చెబుతూ, ఉత్సవాలు, కార్యక్రమాలు నిర్వహించిన కమిటీ సభ్యులను అభినందించారు.

అనంతరం నాటకంలో పాల్గొన్న కళాకారులను కమిటీ సభ్యులు సన్మానించారు. ఆంజనేయ పాత్రధారి శ్రీ అన్నాప్రగడ లక్ష్మీ కాంతారావుకు శ్రీ నంబూరి పూర్ణచంద్రరావు రజత పాత్రను బహూకరించారు. మిగిలిన నటులకుగూడా ఉచితరీతిని బహుమతులు అందజేశారు.

శ్రీ నంబూరి పూర్ణచంద్రరావు వందన సమర్పణతో నవరాత్రి ఉత్సవాలు ముగిశాయి.

వివాహ మహోత్సవం

నెల్లూరు, అక్టోబర్ 18— శ్రీ సర్వేపల్లి కృష్ణమూర్తి గారి కుమార్తె చిరంజీవి సౌభాగ్యవతి అపిలక్ష్మిని, కాకినాడ వివాసులు డాక్టర్ కొట్టిపాటి వెంకటనరసింహం గారి తృతీయ కుమారుడు చిరంజీవి బి. వి. కృష్ణారావుకు ఇచ్చి నెల్లూరు పాండురంగా కల్యాణ మండిరంలో వివాహం జరిపారు.

భద్రాచలంలో పి. సి. సి. అధ్యక్షునికి ఘనస్వాగతం

భద్రాచలం, అక్టోబర్ 18— ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ గొట్టిపాటి బ్రహ్మయ్యగారు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ నీలం సిద్ధారెడ్డిగారు కార్యదర్శులు హీరాలాల్ మోరియా, శ్రీ తోట హరవెంకటప్పయ్యలు వెంటరాగా అక్టోబర్ 14 వ భద్రాచలం వచ్చారు. గోదావరి వర్ధ తాలూకాకాంగ్రెస్ అధ్యక్షులు శ్రీనివసమా వెంకటేశ్వరరావు కార్యదర్శి వై. వి. శివశాస్త్రి, రాష్ట్ర కాంగ్రెస్ సభ్యులు డి. వి. కృష్ణయ్య, శ్రీ ముక్కుదరావు మండల కాంగ్రెస్ అధ్యక్షులు యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శులు, శ్రీ పంచిరి రామిరెడ్డి, పాపినేని వాసుదేవరావు, తెలువారి వెంకటేశ్వరరావులు స్వాగత మిచ్చారు. బ్యాండ్ మేళంతో శ్రీ రామాలయమునకు బ్రహ్మాండమైన స్వాగతంతో వెళ్ళారు దేవదర్శనం తరువాత కార్యకర్తల సమావేశం జరిగినది.

సమావేశంలో ఏజన్సీ ప్రాంతంలోని కార్యకర్తలు, ప్రముఖులు పాల్గొన్నారు. తాలూకా కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ వసమా వెంకటేశ్వరరావు గారు శ్రీ బ్రహ్మయ్యగార్కి స్వాగత పత్రం సమర్పించారు. ప్రధాన కార్యదర్శి శ్రీ వై. వి. శివశాస్త్రి రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు శ్రీ బ్రహ్మయ్యగారికి నూతన పథకములతో సన్మానించి శ్రీ బ్రహ్మయ్య గారు జాతీయ కాంగ్రెస్ సంస్థలో బహుముఖంగా చేసిన సేవలను ప్రశంసించారు.

తదుపరి శ్రీ నీలం సిద్ధారెడ్డి(ఎం.ఎల్.సి) గారు అధ్యక్షులు శ్రీ బ్రహ్మయ్య గారు ఖమ్మం జిల్లాను పాదయాత్రగా నిర్జయించుకొని పర్యటన చేయుచున్నందుకు ధన్యవాదాలు తెలిపారు.

తరువాత ఉద్దరణ సంఘం వారు ఇచ్చిన విందులో పాల్గొన్నారు.

ధరవరలు

బులియన్ మార్కెట్

విజయవాడ, అక్టోబర్ 18—

విజయవాడలో:	
బంగారం పాట్లా (10 గ్రాములు)	121-50
.. మూసా	121-50
సవరన్	96-50
వెండి 1 కి॥ గ్రా॥	217-00
.. 10 గ్రా॥	2-20
మద్రాసులో: బంగారం రెడీ	122-25
ఫార్వర్డ్	120-25
సవరన్	95-50
వెండి 1 కి॥ 11 గ్రా	225-50
వెండి 10 గ్రా	2-30
కలకత్తాలో: వెండి రెడీ	221-00
వెండి ఫార్వర్డ్	221-60
సవరన్	97-50
బొంబాయిలో: బంగారం రెడీ	120-85
ఫార్వర్డ్	120-10
సవరన్	95-00
వెండి రెడీ	221-70
ఫార్వర్డ్	222-70

బొంబాయి మార్కెట్

ఆముదం	166-25
వేరుశనగ	230 87
అవిసెగింజలు	40-25
పత్తి గింజలు	103-50

కొబ్బరికాయలు (1000)

విజయవాడలో కొత్తవి	180-00
పాతవి	225-00
రాజమండ్రిలో కొత్తవి	150-00
పాతవి	210-00
అమలాపురంలో కొత్తవి వెయ్యి	150-00
వందువి	210-00
పాలకొల్లులో కొత్తవి	170-00
.. పాతవి	210-00

అంబాజీపేట కురిడీకాయ ధరలు

గండేరా (1000 కి)	273-00
గండేరా చిన్నకాయ	215-00
గిటగిటా ..	265-80

గోతామల ధరలు

గోతాములు 100 కి. డి. ఫిల్మ్యు:	130-00
ఫార్వర్డ్ అక్టోబర్	110 00
చారసంచులు 100 కి:	110-00

అదనపు భూమిశిస్తు నిరసన వారం

నవంబర్‌లో జరపడానికి కిసాన్ సమ్మేళనం నిర్ణయం

విజయవాడ, అక్టోబర్ 18— కృష్ణాజిల్లా స్వతంత్ర పార్టీ కార్యాలయంలో శ్రీ గొట్టిపాటి వెంకటసుబ్బయ్య అధ్యక్షతను రాష్ట్రీ కిసాన్ సమ్మేళన్ కార్యవర్గం సమావేశం ఈ నెల 14 వ తేదీన జరిగింది. 150 మంది కార్యకర్తలు ఈ సమావేశానికి హాజరయ్యారు. రాష్ట్రీ స్వతంత్రపార్టీ అధ్యక్షులు శ్రీ నెలవాడ రామచంద్రారెడ్డి, కార్యదర్శి శ్రీ తేళ్ళ క్రిష్ణమ్మ, శ్రీయుతులు బి. వి. శివయ్య, కొమ్మారెడ్డి బాపయ్య, సుంకిర సత్యనారాయణ, పిలేటి శేషగిరిరావు, తాగర్ల మూడిచంద్రమౌళి, పిసుపులేటి కోటేశ్వరరావు, తదితర ప్రముఖులు కూడా సమావేశానికి హాజరయ్యారు.

శ్రీ గొతు లక్ష్మన్న అదనపు భూమిశిస్తుమీగురించి, దానిని ప్రభుత్వం ఉపసంహరించే వరకు కిసాన్ సమ్మేళన కార్యవర్గం, కార్యాచరణ సంఘం జరపతగిన కార్యక్రమాన్ని గురించి వివరించారు.

స్వతంత్ర పార్టీ ప్రముఖ కార్యకర్త శ్రీ పల్లిపెద్ది అర్జునరావు మృతికి తమ లోతైన సంతాపాన్ని వెలిబుచ్చుతూ సమావేశంలో తీర్మానించారు.

కిసాన్ సమ్మేళన్ సభ్యత్వం విరివిగా చేర్పించడానికి జిల్లాకిసాన్ సమ్మేళన్ సమావేశాలను ఈ నెలాఖరులోగా జరపడానికి జిల్లా కిసాన్ సమ్మేళన్ కార్యాచరణ సంఘాన్ని ఏర్పాటు చేయడానికి నవంబరు 7 వ తేదీనుంచి 15 వ తేదీ వరకు అదనపు భూమిశిస్తు నిరసన వారం జరిపి, గ్రామాలలో విరివిగా ప్రచారం చేయడానికి ఈ దిగువ పేర్కొన్నవారిని ఆయా జిల్లాలకు నియమిస్తూ తీర్మానించారు.

కృష్ణాజిల్లా: శ్రీ కొలారు వెంకటేశ్వర్లు. పశ్చిమగోదావరి జిల్లా: శ్రీ బి. అమృతరామరాజు. తూర్పుగోదావరి జిల్లా: శ్రీ మోరంపూడి సీతారామయ్య. విశాఖపట్టణం జిల్లా: శ్రీ సైలాడ పైడితల్లి. శ్రీకాకుళం జిల్లా: శ్రీ సిమ్మా జగన్నాథం. గుంటూరు జిల్లా: శ్రీ నాగినేని వెంకయ్య. నెల్లూరు జిల్లా: శ్రీ పెళ్ళకూరు రామకృష్ణారెడ్డి. చిత్తూరు జిల్లా: శ్రీ టి. పి. రాజన్. కడప జిల్లా: శ్రీ కె. నూరారెడ్డి. కర్నూలు జిల్లా: శ్రీ పి. రామకృష్ణారెడ్డి. అనంతపురం జిల్లా: శ్రీ పి. అశ్వర్థార్థ. తెలంగాణా ప్రాంతం: శ్రీ రామచంద్రదేశపాండ్యే, శ్రీ కె. నరసింహారావు గారలు. రైతు బాంధవుడు, రైతు ఉద్యమ తీర్మానం చేశారు.

ఆకాశవాణి

శనివారం, అక్టోబర్ 20

(శక 1884 ఆశ్వయుజ 25)

విజయవాడ

8.7 - 1 మీ. (840 కిలోసై)

ఉ॥ 6-30 సుప్రభాతం, 6-35 భక్తిరంజని: వెంకటేశ సుప్రభాతం-ఎమ్. ఎస్ సుబ్బులక్ష్మి; బృందం, 7-00 తెలుగులో వార్తలు, 7-15 సంగీత శిక్షణ, 7-30 గాత్ర సంగీతం, 8-00 ఆంగ్లమున వార్తలు, 8-30 వీణ. మ॥ 12-30 కార్మికుల కార్యక్రమం: (హైదరాబాద్ నుంచి రిలే) 1-00 పనితావాణి: కె. రామభద్రరావు గేయం, 1-30 విశ్వవిద్యాలయాలకు (హైదరాబాద్ నుంచి రిలే). 1-50 తెలుగులో వార్తలు. 2-00 బొమ్మరిల్లు. సా॥ 6-00 స్థానిక ప్రకటనలు. 6-05 ప్రాంతీయ వార్తలు. 6-15 గ్రామస్థుల కార్యక్రమం, 7-00 తెలుగులో వార్తలు, 7-15 గ్రామస్థుల కార్యక్రమం, 7-30 నాకు ఎక్కడా కనబడలేదు: నమ్మదగిన మిత్రుడు-ప్రసంగం: భావరాజు నరసింహారావు. 7-40 ఫిల్మ్ సంగీతం. 8-00 వీణ, 8-30 ఆకాశవాణి వార్తావాహిని, 8-45 హైదరాబాద్ ఎ పలె, 9-00 ఆంగ్లమున వార్తలు, 9-15 సూర్యోదయం: నాటిక-కొమ్మూరి వేణుగోపాలరావు. 9-30 అఖిల భారత సంగీత కార్యక్రమం, 11-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

విజయవాడ - బి

వివిధ భారతి

(200 మీ॥ 1,500 కి॥ సై॥)

ఉ॥ 7-00 నుంచి 9-00 గం.
మ॥ 11-00 నుంచి 12-08 గం.
సా॥ 2-00 నుంచి 3-00 గం.

పండగలకు, ఆదివారాలలో

ఉ॥ 7-00 నుంచి 9-00 గం.
మ॥ 10-15 నుంచి 12-00 గం.
సా॥ 2-00 నుంచి 3-30 గం.

హైదరాబాద్ - ఎ

405 - 4 మీ. (740 కిలోసై)

ఉ॥ 6-30 సుప్రభాత్, 6-35 భక్తిరంజని: (విజయవాడ నుంచి రిలే) 7-00 తెలుగులో వార్తలు, 7-15 సంగీత శిక్షణ, (విజయవాడ నుంచి రిలే). 7-30 బృంద గానం. 8-00 ఆంగ్లమున వార్తలు. 8-30 విజయవాడ పలె. మ॥ 12-30 కార్మికుల కార్యక్రమం, 1-00 పనితావాణి (విజయవాడ నుంచిరిలే) 1-30 విశ్వవిద్యాలయాలకు, 1-50 తెలుగులో వార్తలు. 3-30 బాలానందం, సా॥ 6-00 స్థానిక ప్రకటనలు. 6-05 ప్రాంతీయ వార్తలు. 7-00 తెలుగులో వార్తలు. 7-15 ఘజల్. 7-30 పసంగం (విజయవాడ నుంచి రిలే) 7-40 అందాలారెలో అరకులోయ గిరిజనాభ్యుదయం: రూపకం-సమర్పణ: వి. సహాయా 11-00 ప్రసార సమాప్తి.

నంద. 8-15 నాకై తమ ప్రభావాన్ని చూపిన గ్రంథాలు: కె ఎమ్ మున్షీ ఆంగ్లప్రసంగం. 8-30 ఆకాశవాణి వార్తా వాహిని, 9-00 ఆంగ్లమున వార్తలు, 9-30 అఖిల భారత సంగీత కార్యక్రమం, 11-00 వాతావరణ సూచన ప్రసార సమాప్తి.

హైదరాబాద్ - బి

60 - 12 మీ. (4,990 కిలోసై)

ఉ॥ 6-30 హైదరాబాద్ ఎ పలె, 8-00 హైదరాబాద్ ఎ పలె. మ॥ 12-30 హైదరాబాద్ ఎపలె, 3-30 హైదరాబాద్ ఎపలె. సా॥ 6-00 హైదరాబాద్ ఎపలె, 6-15 గ్రామస్థుల కార్యక్రమం, 7-00 తెలుగులో వార్తలు, 7-15 గ్రామస్థుల కార్యక్రమం, 7-30 హైదరాబాద్ ఎ పలె, 8-00 గానామృతం: జి. ఎన్. బాలసుబ్రహ్మణ్యం, 8-15 హైదరాబాద్ ఎ పలె, 9-15 నాటిక (విజయవాడ నుంచి రిలే) 9-30 హైదరాబాద్ ఎ పలె, 11-00 వాతావరణ సూచన, ప్రసార సమాప్తి.

మద్రాస్ - ఎ

410 - 7 మీ. (720 కిలోసై)

ఉ॥ 6-45 మంగళగానం, 7-30 రాజేశ్వరీ రంగనాథన్, 8-00 మధురగీతం. మ॥ 1-00 కదంబం, 1-30 గానమంజరి. 2-10 వాద్య సంగీతం, 2-30 ఎమ్. పి. గంగారామ్, సా॥ 5-30 ఎన్. ఎమ్. నారాయణన్. 7-30 శారదా శంకర్, 8-00 కౌసల్యా రాజారామ్: వీణ, 8-30 ఆకాశవాణి వార్తా వాహిని (ఆంగ్లం ఢిల్లీ నుంచి రిలే), 9-00 చిత్తూరు సుబ్రహ్మణ్యశాస్త్రి, 9-15 మధురగీతం, 9-30 అఖిల భారత సంగీత కార్యక్రమం: కెమ్మంగుడి శ్రీనివాస అయ్యర్. టి ఎన్. కృష్ణన్: వయొలిన్: టి. కె. మూర్తి మృదంగం (ఢ

కోయంబత్తూరులోని గృహ నిర్వహణ శాస్త్ర కళాశాల ఉపాధ్యాయినుల బృందం మొన్న హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డి దంపతులను వారి నివాస భవనం "గ్రీన్‌లాండ్స్"లో కలుసుకొన్నప్పటి చిత్రం

"పన్నుల విధానంలోని లోటుపాట్లను ప్రభుత్వం తప్పక తొలగిస్తుంది"

వర్తకులు ఆందోళన చెందరాదని హిందూపురం సభలో మంత్రి శ్రీ గురుమూర్తి హామీ

("ఆంధ్రజ్యోతి" విలేకరి) హిందూపురం, అక్టోబర్ 18.—

వ్యాపారాభివృద్ధికి వర్తకులు పన్నులు చెల్లించక తప్పదనీ, ఈ సందర్భంలో వారికి ఏవైనా సాంకేతిక బాధకాలుంటే, వాటిని ప్రభుత్వం తొలగించగలదని కార్మిక, రవాణాశాఖల మంత్రి శ్రీ బి. వి. గురుమూర్తి ఇక్కడ హామీ ఇచ్చారు.

ఈనెల 13 వ తేదీ స్థానిక బోకు జాలి వర్తక సంఘం ప్రథమ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మంత్రి శ్రీ బి. వి. గురుమూర్తిగారికి బోకు జాలి వర్తక సంఘం అధ్యక్షుడు శ్రీ కట్టా లక్ష్మీనారాయణయ్య, మండీ వ్యాపారుల సంఘ కార్యదర్శి శ్రీ డి. రాజరత్నం, వట్టువస్త్రాల వర్తకుల సంఘం కార్యదర్శి శ్రీ దాసా రాధాకృష్ణ సన్మాన పత్రాలు సమర్పించారు.

శాసన సభ్యుడు శ్రీ కె. సీతయ్యగుప్త, విజయవాడ బట్టల వర్తక సంఘాధ్యక్షుడు శ్రీ పచ్చిపులుసు వెంకటరత్నంబాబు, శ్రీ బెల్లె కుమారస్వామి ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీ జాలూరి వీరేశలింగం, శ్రీ కోకిల రాజయ్య గుప్త, సికింద్రాబాద్ మాజీ మేయర్ శ్రీ నిర్మాన సత్యనారాయణగుప్త, శ్రీ శారదచంద్ అగర్వాల్, మైసూరు మాజీ మంత్రి శ్రీ పామిడి సుబ్బరామశెట్టి, శ్రీ కోటా రామయ్యశెట్టి, శ్రీ వై. ఎస్. గోపాలకృష్ణశెట్టి, శ్రీ ఏ. ప్రభాకరరావు, శ్రీ కె. ఆర్. కృష్ణయ్యశ్రేష్ఠి గారలకు కూడా అనేక వ్యాపార సంస్థలు సన్మాన పత్రాలు సమర్పించినవి.

వార్షికోత్సవ సభకు శ్రీ కొత్తూరు సీతయ్య గుప్త అధ్యక్షత వహించారు. దైవ ప్రార్థనానంతరం శ్రీ కట్టా లక్ష్మీనారాయణయ్య శ్రేష్ఠి అతిథులకు, సభికులకు స్వాగతం చెప్పారు.

సన్మాన పత్రానికి సమాధానమిస్తూ మంత్రి శ్రీ గురుమూర్తి ఇలా అన్నారు:

"వ్యాపారస్థులకు పెక్కు ఇబ్బందులున్నమాట వాస్తవమే. సికింద్రాబాద్, హైదరాబాద్, విజయవాడ వంటి నగరములలో వర్తకుల బాధలు చెప్పనలవి కావు. బట్టల వ్యాపారముపై నూటికి 18 వంతులు లాభం తీయవచ్చునని ప్రభుత్వం చెప్పింది. నాకు కూడా ఒక బట్టల దుకాణం. హోల్‌సేల్ వస్తువుల విక్రయశాల. ప్రింటింగ్ ప్రెస్సు వున్నవి. వర్తకుల సాధకబాధకాలేమో నాకు బాగా తెలుసు. బట్టల మిల్లుల యజమానులు తమ ఇష్టవచ్చిన ధరలను తాము తయారు చేసిన గుడ్డపై ముద్రించడంవల్ల అటు బోకు వర్తకుడు, చిల్లర వ్యాపారి ఇటు కొనుగోలుదారు లాభం పొందలేక పోతున్నారు. ఇలాంటి అక్రమాలను మీ సంఘాలద్వారా, ఫెడరేషన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తేకూలి అట్టి అక్రమాలను సాగనివ్వరాదు.

"ఇక రెండవ విషయం: ప్రభుత్వాన్ని మంత్రులను దుయ్యబట్టడంతో మీకు కలిగే లాభం లేదు. నిర్మాణాత్మకమైన విమర్శ అభిలషణీయం. కాని, దూషణలు నిష్ప్రయోజనం. ప్రభుత్వానికి మీ కష్ట నష్టాలను మీ ప్రతినిధులద్వారా, సంఘాలద్వారా, ఫెడరేషన్ ద్వారా తెలియజేయండి. వాటి నిర్మూలనకు సహకార పంథాలో కృషి చేయండి. మంత్రులమైన మేము మీలాంటి మానవులమేకాని మానవాతీతులం కాము. మాలో పొరపాట్లు వుండడం సహజం. మీరు మా పొరపాట్లను సూచించే తప్పక వాటిని సరిదిద్దుకుని మీతో సహకరించగలం"

"మీ వ్యాపారాన్ని అభివృద్ధిపరచు కొనడానికి కృషిచేయండి. ఇక సేల్స్ టాక్స్ విషయం: పన్నులు మీరు చెల్లించాలి అధికపన్నుల విషయంలో సబబైన మీ కోరికలను తప్పక పరిశీలించగలమని హామీనిస్తున్నాను. ఇది ప్రజాస్వామ్య ప్రభుత్వం. చైనా, రష్యాల ప్రభుత్వాలవలె నిరంకుశ ప్రభుత్వం కాదు. మీ సంఘాల ద్వారా తీర్మానాల రూపంలో మీ కోరికలను తెలియజేయండి. వర్తక ప్రతినిధులకు జాతీయ ప్రభుత్వంలో స్థానమున్నది. నేను మీ ప్రతినిధిని. ఇలాగే 16 మంది వర్తక సోదరులు మన రాష్ట్ర శాసనమండలిలోను, శాసనసభలోను సభ్యులుగా వున్నారు. కులమతవర్గ రహిత ప్రజాస్వామ్యం మనది. కాన, కులమతవర్గ ప్రసక్తిని మేమాత్రం దృష్టిలో వుంచుకొని వ్యవహరించరాదు."

"అక్ట్రాయ్ విషయం పరిశీలించి మీకు న్యాయం కలిగేలాగున మన ముఖ్యమంత్రి శ్రీ సంజీవరెడ్డిగారితోను, ఇతర మంత్రులతోను సంప్రతించి కృషి సలుపగలనని హామీనిస్తున్నాను."

అధ్యక్షోపన్యాసం

సమావేశానికి అధ్యక్షత వహించిన శ్రీ కొత్తూరు సీతయ్యగుప్త తమ అధ్యక్షోపన్యాసంలో ఇలా పలికారు:

"శ్రీ గురుమూర్తి వంటి అభ్యుదయ భావాలుగల ఉదాత్తులైన యువకులు మంత్రి వర్గంలో వుండడం మన అదృష్టం. తొలి సారిగా ఆంధ్రప్రభుత్వం వర్తకులకు ప్రాతినిధ్యం ఇచ్చింది. రాష్ట్రముఖ్యమంత్రిని ఈ విషయంలో తప్పక అభినందించాలి. శ్రీ గురుమూర్తి వ్యాపారికాబట్టి, వర్తకుల బాధలు, కష్టనష్టాలు ఆయనకు బాగా తెలుసు.

"శాంతియుత పద్ధతులతో, సహకార భావంతో మన సమస్యలను ప్రభుత్వం దృష్టికి తెచ్చి పరిష్కరించుకోవాలి. వివాదాలతో, దూషణలతో పనులు జరగవు. కార్యదక్షత, ఓరిమి, సహనభావం, నిర్మాణాత్మకమైన విమర్శ చేయడం అలవరచుకోవాలి.

"పన్ను చెల్లించేవారం మనం. ప్రభుత్వాన్ని పోషించేవారం మనం. కాన, మనలను పోషించే భారం ప్రభుత్వంపై కలదు. గురుతరమైన బాధ్యతలు ప్రభుత్వం నిర్వహించవలసివున్నది. బాధ్యతల నిర్వహణలో లోపాలు వుండడం సహజం. వాటిని మన ఫెడరేషన్ ద్వారా, వర్తక సంఘాల ద్వారా ప్రభుత్వం దృష్టికి తెచ్చి, వాటి నివారణకై కృషి చేయాలి. ఈ కృషిలో మీ సహకారం కావాలి."

కాంగ్రెస్ ప్రభుత్వం తప్ప మరి ఏ ఇతర రాజకీయ పక్షం కూడా మన సమస్యలను ఇప్పటి పరిస్థితులలో పరిష్కరించజాలదు. కాన కాంగ్రెస్ ప్రభుత్వం మన సమస్యలను పరిష్కరించేటట్టు చూడాలి.

తదనంతరం సంఘ కార్యదర్శి శ్రీ ఎమ్. ఎన్. రాధాకృష్ణయ్య సంఘవార్షిక నివేదికను చదివారు

అధ్యక్షుల అంతిమ పలుకుల అనంతరం సంఘ కార్యదర్శి వందన సమర్పణతో సమావేశం ముగిసింది

జాతీయ గీతాలాపనతో నాటి కార్యక్రమం సమాప్తమైనది. రాత్రి అతిథులకు, మహాసభ ప్రతినిధులకు, పురప్రముఖులకు విందు జరిగింది.

పౌర సన్మానం

ఈ నెల 14 వ తేదీన రాష్ట్ర రవాణా, కార్మికశాఖామంత్రి శ్రీ బి. వి. గురుమూర్తికి పురపాలక సంఘం పౌర సన్మానం చేసింది. అల్పాహార విందు అనంతరం పురపాలక సంఘాధ్యక్షుడు శ్రీ కట్టా లక్ష్మీనారాయణయ్య శ్రేష్ఠి మంత్రిని పుష్పమాలాలంకృతుని కావించి, సన్మానపత్రం సమర్పించారు.

సమావేశమునకు శాసన సభ్యుడు శ్రీ కొత్తూరి సీతయ్య గుప్త, వర్తక మహాసభ ప్రతినిధులు, అధికార, అనధికార విముఖులు హాజరైనారు.

సన్మానపత్రానికి మంత్రి సమాధానమిస్తూ ఇలా అన్నారు:

"రోడ్డు రవాణాశాఖ నాది కావడం వల్ల ఇక్కడనుంచి నెల్లూరుకు బస్సు వేయాలనే మీ కోర్కె నెరవేర్చడానికి తప్పక కృషి చేయగలనని హామీనిస్తున్నాను. బెంగుళూరు మైసూరురాష్ట్రంలోనిది కాన, ఆ ప్రభుత్వాన్ని సంప్రతించకుండా నేను మీ కోర్కె నెరవేర్చలనని ఇప్పటికిప్పుడే హామీ ఇవ్వలేను

"ఇక సినిమాల, పాలిటెక్నిక్ శిక్షణ కళాశాల మీ పట్టణంలో నెలకొల్పాలని కోరారు. జిల్లా కేంద్రమైన అనంతపురంలో ఇవి రెండు కళాశాల ఉన్నవి. ఇంజనీరింగ్ కళాశాల ఉన్నది. ప్రభుత్వస్థానంలో ఇక్కడ వీటిని స్థాపించడం ఇప్పటి పరిస్థితులలో ప్రసక్తి కాదనుకొంటున్నాను.

"ద్రోణకలంలో శ్రీ వెంకటశెట్టి రెండు లక్షలు విరాళ మిచ్చి తమ తండ్రిగారి పేరిట సాంకేతికశిక్షణ కళాశాలను తమ గ్రామంలో స్థాపించ వలెనని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే మీరు రెండు లక్షలు విరాళం ప్రోగు చేసి యివ్వగలిగితే ప్రభుత్వం ఈ విషయంలో మీకు తప్పక సహాయపడుతుంది. అన్ని పనులు ప్రభుత్వ స్థాయిలో జరుగగలవని ఆశించడం తగదు. మీరు ముందుకు రావాలి. ప్రభుత్వం తన అండదండల నందివ్వగలదు.

"ఇక్కడి పురపాలక సంఘం చక్కగా పనిచేస్తున్నదని విని చాలా సంతసించుచున్నాను.

"మీ పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుకొనండి. నేను సికింద్రాబాద్ పురపాలక సంఘాధ్యక్షుడుగా ఉన్నప్పుడు పేద ప్రజల కోసం మురికివాడలలో చౌకగా అనువైన స్థలాలు స్థాపించి, వారి సేవ చేయగలిగాను. కాన, మీరు కూడా అలాంటి డిస్పెన్సరీలను మీ పట్టణంలో మీ సంఘం ద్వారా నడపండి

"మీ సంఘంలో "మునిసిపల్ పాలిటిక్స్" లేవని తెలుస్తున్నది. ఇది సంతోషించదగ్గ విషయం. ఇతర మునిసిపాలిటీలలో రాజకీయ పార్టీల అభ్యర్థులైన సభ్యులలో కలతలు చాలావుంటాయి. రాజకీయ పార్టీల జోలిపోయి పట్టణ అవసరములను మరచిపోయిన సభ్యులు తమను ఎన్నుకొన్న ప్రజలకు తీరని అపచారం చేసిన వారగుదురు."

తదనంతరం పురపాలక సంఘాధ్యక్షుని వందన సమర్పణానంతరం జాతీయ గీతాలాపనతో కార్యక్రమం ముగిసినది.

రోటరీ క్లబ్‌లో

సాయంకాలం పట్టణ రోటరీ క్లబ్ ఆధ్వర్యాన సహకార బ్యాంకులో సభ జరిపి మంత్రిని గౌరవించారు. క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ హెచ్. గోపాలరావు అధ్యక్షత వహించారు. కార్యదర్శి శ్రీ సేతురావుమంత్రికి సభికులకు స్వాగతం చెప్పారు. క్లబ్ ఆశయాలను, కార్యకలాపాలను అధ్యక్షుడు వివరించారు. స్థానిక బాలికోన్నత పాఠశాలలో బాలికలకు వసతి సౌకర్యం చాల తక్కువగా వున్నదని, ఆ లోటును తీర్చాలని మంత్రిని కోరారు.

అనంతరం మంత్రి ప్రసంగిస్తూ ఈ విషయం రాష్ట్ర విద్యా మంత్రితో సంప్రతించి తగు విధంగా సహాయపడగలనని హామీ యిచ్చారు.

రొటేరియన్ శ్రీ కె. యల్ రామలింగం సందర్భ సమర్పణ చేశారు. అల్పాహారవిందు అనంతరం మంత్రి వర్తక మహాసభలో పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ వర్తక మహాసభ

ఈ నెల 14 న జరిగిన అఖిల ఆంధ్రప్రదేశ్ అయిదవ వర్తక మహాసభకు ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీ జాలూరి వీరేశలింగం గుప్త అధ్యక్షత వహించారు.

ఉదయం పదిగంటలకు సికింద్రాబాద్ బట్టల వర్తక సంఘాధ్యక్షుడు శ్రీ సోమ వెంకటేశ్వరరావు త్రివర్ణ ప్రతాకాన్ని ఆవిష్కరించారు.

శ్రీ డి. ఏ. కృష్ణమూర్తి దైవప్రార్థనానంతరం ఆహ్వాన సంఘాధ్యక్షుడు శ్రీ పుట్టా నారణయ్య స్వాగతోపన్యాసం చేశారు.

ఫెడరేషన్ కార్యదర్శి శ్రీ కోకిల రాజయ్య తమ నివేదికను చదివారు.

వివిధ ప్రాంతములనుంచి వర్తక ప్రముఖులు పంపిన సందేశములను శ్రీ డి. వెంకటేశ్వర్లు చదివారు.

తీర్మానాలు

అక్ట్రాయ్‌పన్ను వర్తకులకు తీరనిచిక్కులు తెచ్చిపెడుతూ వున్నందున దాన్ని రద్దు చేయాలని, మోడల్ షెడ్యూల్ అమలు ప్రసక్తి విరమించాలని ప్రభుత్వాన్ని కోరుతూ తీర్మానించారు.

ఈ తీర్మానాన్ని శ్రీ పచ్చిపులుసు వెంకటరత్నంబాబు (విజయవాడ) ప్రతిపాదించగా, శ్రీ జయరాజగోపాల్ (హిందూపురం) బలపరచారు.

ఈ సందర్భంలో శ్రీ కొత్తూరు సీతయ్య గుప్త ప్రసంగిస్తూ ఈ విషయంలో మంత్రులను, నాయకులను కలుసుకొని వర్తకులకు న్యాయం కల్పించగలనని హామీ ఇచ్చారు

ఈ నెల 25 న రాష్ట్రపు పాలకసంఘాధ్యక్షుల సమావేశం రాజధాని నగరంలో జరుగనున్నదని అప్పుడు ఈ ప్రసక్తిని ప్రభుత్వంద్వారా తీసికొని రాగలనని క్రమమైన పద్ధతిలో పనులు జరుపుకోవాలిగాని మంత్రులను, ప్రభుత్వాన్ని, ఉద్యోగులను

[మిగతా 8 వ పేజీలో]

సరిహద్దులోని మన సైనికులకు మిఠాయిలు

సరోని, అక్టోబర్ 18 — ఇండియా ఉత్తర సరిహద్దును పరిరక్షిస్తున్న సైనికులకు దీపావళి సందర్భంగా మిఠాయిలు పంపడానికి భారత సేవక్ సమాజ్ స్థానిక శాఖవారు నిన్న నిశ్చయించారు.

మిఠాయిలను కొని, మన సైనికులకు పంపే నిమిత్తం తాము సేకరించిన నిధులను సమాజ్ కార్యకర్తలు రక్షణ మంత్రిత్వ శాఖవారికి అందజేస్తారు.

బీహార్ నాగరిక సంఘంవారు కూడా రాష్ట్ర ప్రజల తరఫున సరిహద్దులోని మన సైనిక జవానులకు దీపావళి సందర్భంగా మిఠాయిలు పంపడానికి నిశ్చయించారు.

బందరులో భారీ వర్షాలు

మంగినపూడిలో పదియిండ్లు కూలిపోయినట్టు వార్త

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

బందరు అక్టోబర్ 18 — సోమవారం ఉదయంనుంచి బందరులో భారీ వర్షాలు కురుస్తున్నాయి. కంటోన్మెంట్ మెయిన్‌రోడ్ మొదలైన వాటితోసహా పల్లపు ప్రాంతాలన్నింటిలో మోకాటిలోతు నీరు వుంది.

గత నెలలో కురిసిన వర్షాలకు పాడైపోయిన రోడ్ల స్థితి ఈ వర్షాలవల్ల పూర్తిగా అధ్వాన్నమైనది. మంగినపూడిలో పదిఇండ్లు కూలిపోయినట్టు తెలుస్తున్నది. ఇంకా వర్షం కురిసినట్టయితే వంటలకు తీరని నష్టం కలుగగలదని భావిస్తున్నారు.

వీరవల్లి గ్రామంలో కలరా

ఇద్దరి మరణం

("ఆంధ్రజ్యోతి" విలేకరి)

హనుమాన్‌జంక్షన్ అక్టోబర్ 18 — ఇక్కడకు నాలుగు మైళ్ళ దూరంలోగల వీరవల్లిలోని హరిజనవాడలో మొన్న కలరావల్ల ఇద్దరు మరణించారు. ఇదే సమితిలోనే పెరికీడు గ్రామంలో ఈ వ్యాధి వల్లనే ఒకరు మరణించారు. ప్రాణ ప్రధాన కేంద్రమైన వీరవల్లిలో ఈ వ్యాధిని నివారణకై ఇంతవరకు ఆరోగ్యశాఖాధికారులు ఎలాంటివర్యలు తీసికోలేదని తెలిసింది. ఈ సమితి ప్రాంతంలో పలువోట్ల ఈ వ్యాధి ప్రవేశించిందని తెలుస్తున్నది. ఆరోగ్య శాఖాధికారులు వెంటనే కలరా నిరోధక చర్యలు తీసుకొనవలసిన ఈ వ్యాధి ఇంకను ఉధృతమయ్యే సూచనలు కానవస్తున్నవి. ఈ సమితి ప్రాంతంలో ప్రజలు ఈ వ్యాధివల్ల భయాందోళనలు చెందుతున్నారు.

క్రీడాభిరామం:

కనగాలలో చెదుగుడు పోటీలు

గుంటూరు, అక్టోబర్ 18 — గుంటూరు జిల్లా చెదుగుడు పోటీలు రేపల్లె తాలూకాలోని కనగాలలో ఈ నెల 26, 27, 28 తేదీలలో జరుగుతాయి ఈ సందర్భంలో సైకిలు పందాలు కూడా నిర్వహిస్తారు.

చెదుగుడు పోటీలలో పాల్గొనదలచిన టీములు ప్రవేశ రుసుము ఆరు రూపాయలు చెల్లించాలి.

ఈపోటీలలో పాల్గొనగోరుటీములు కనగాలలోని ఈ టోర్నమెంట్స్ నిర్వాహకులకు ఈ నెల 24 వ తేదీలోగా తెలియజేయాలి.

ప్రతి పద్యం అమృతం ఒలికిస్తుంది. ప్రతిమాట ఆనందం పులకిస్తుంది. హాస్యంతో - లాస్యంతో యుద్ధాలతో ప్రబోధాలతో - నవరసభరితంగా కన్నుల పండుగ చేసే కమనీయ మహాభారత పౌరాణిక చిత్రం



ఏజెంట్లు కావలెను

ఈ క్రింది పేర్కొనబడిన చోట్లలో మా "ఆంధ్రజ్యోతి" దినపత్రికను తమ సంతబాధ్యతపై విక్రయించుటకు ఏజెంట్లు కావలెను

1. విస్సన్నపేట (కృష్ణా జిల్లా)
2. చేబ్రోలు (గుంటూరు జిల్లా)

సర్క్యులేషన్ మేనేజరు.
"ఆంధ్రజ్యోతి"

Printed and Published by K. L. N. Prasad at Andhra Printers Ltd Vijayawada-2.
Editor: Narla Venkateswara Rao.